# జనపదం
J A N A P A D H A M

హైదరాబాద్ | మంగళవారం 12 నవంబర్ 2024 | సంచిక: 1 సంపుటి: 154

తెలుగు దినపత్రిక




## కిలో ఉల్లి రూ.100..?

ఢిల్లీ, ముంబైలో ఆకాశానికి ధరలు..
బేజారవుతున్న వినియోగదారులు..

4



## లైన్ క్లియర్..

**పత్తి కొనుగోళ్లపై తొలిగిన ప్రతిష్టంభన**
**మంత్రి చొరవతో సమస్యకు పరిష్కారం..**
**రైతులు ఆగం కావొద్దు : కిషన్ రెడ్డి**

**జనపదం, హైదరాబాద్ సిటీ:**

రాష్ట్రంలో పత్తి కొనుగోళ్లలో నెలకొన్న ప్రతిష్టంభన తొలిగిపోయి లైన్ క్లియర్ అయ్యింది. తెలంగాణలో పత్తి కొనుగోళ్లు నిలిచిపోయిన నేపథ్యంలో కిషన్ రెడ్డి కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ తో మాట్లాడి పరిస్థితిని వివరించి రైతులను ఆదుకోవాలని కోరారు. కిషన్ రెడ్డి వినతికి సానుకూలంగా స్పందించిన మంత్రి తెలంగాణలో పత్తి కొనుగోళ్లు జరపాలని ......(తరువాయి 4లో)



## సిగ్గుండాలే..

**ప్రాణాలతో పైసలాటా..**
**మద్యంతో ఆదాయం పెంచుకుంటారా..?**
**లక్ష్యం చేరలేదని సస్పెన్షన్లా..?**
**సర్కార్ డొల్లా తనానికి ఇదే నిదర్శనం..**
**మాజీ మంత్రి హరీష్ రావు**

**జనపదం, హైదరాబాద్ క్రైమ్:**

మద్యం అమ్మకాల లక్ష్యాలను చేరుకోనందుకు 30 మంది ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్లకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం మెమోలు జారీ చేయడం కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలోని డొల్లాతనాన్ని బయట పెడుతున్నదని మాజీ మంత్రి ......(తరువాయి 4లో)

## అంగన్ వాడీల్లో మరిన్ని సౌకర్యాలు..



**ప్రతిపాదనలు సిద్ధం చేయండి..**
**కేంద్ర మంత్రి బండి సంజయ్..**
**భూపాలపల్లి జిల్లాలో పర్యటన..**
**ఐడీఓసీ కార్యాలయంలో అధికారులతో సమీక్ష**


3



## బాసర ట్రిపుల్ ఐటీలో విద్యార్థిని ఆత్మహత్య

**మృతిపై అనుమానాలు..?**
బాధ్యులపై చర్యలు తీసుకోవాలి : స్వాతిప్రియ తల్లిదండ్రులు

4



4

## 13 మంది ఐఏఎస్‌ల బదిలీ

స్మితా సభర్వాల్కు మరో పోస్టింగ్
జీహెచ్ఎంసీ కమిషనర్‌గా ఇలంబరితి



## రంగు పడుద్ది..

**కర్ణాటకలో కలర్ వివాదం..**
**మంత్రి జమీర్ వ్యాఖ్యలతో రాజుకున్న దుమారం..**
**తీవ్రంగా ఖండించిన జేడీఎస్, బీజేపీ..**
**జమీర్ మాటలపై కేంద్ర మంత్రి కిరణ్ రిజుజు ఆగ్రహం..**
**జాత్యాహంకార ముచ్చట్లు సరికాదని మండిపాటు..**

3

# ఫార్మా.. ఫైర్..?!

## భూముల కేటాయింపుపై గందరగోళం..

- ఇవ్వడానికి ఇష్టపడని అన్నదాతలు..
- లగచర్లకు చర్చలకెళ్లిన యంత్రాంగం..
- కలెక్టర్ కు వ్యతిరేకంగా నినాదాలు..
- వాహనాలపై రాళ్ల దాడి..
- తీవ్ర ఉత్కంఠ.. భారీగా పోలీసుల మోహరింపు..

**అన్నదాతలకు ఆగ్రహమొచ్చింది. తల్లిగా భావించే భూమిని బలవంతంగా లాక్కునే ప్రయత్నం చేస్తున్నారనే కోపంతో ప్రతిఘటనకు సిద్ధమయ్యారు. ఎంతటివారు వచ్చినా సరే భూములిచ్చేది లేదని భీష్మించారు. పంట భూములను పాడు చేయొద్దని, ఫార్మా పేరుతో బజారున పడేయొద్దని బతిమిలాడారు., చివరకు ఎదురు తిరిగారు. ఈ క్రమంలోనే చర్చించడానికి వచ్చిన కలెక్టర్ సహా ఇతర ఉన్నతాధికారులపై అసహనం వ్యక్తం చేశారు. తమ బతుకులు తమను బతకనివ్వాలని, మందుల గత్తరలో మసి చేయొద్దని వేడుకున్నారు. యంత్రాంగం వినిపించుకోకపోవడంతో విసుగుపుట్టి ఎదురు తిరిగారు. కలెక్టర్ వాహనంపై రాళ్లదాడికి దిగారు. ఒకానొక సందర్భంలో ఓ మహిళా కలెక్టర్ పై చేయిచేసుకున్నట్టుగా కూడా సమాచారం. హఠాత్ పరిణామంతో లగచర్లలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ముందస్తుగా పోలీసులు భారీగా మోహరించారు. కట్టుదిట్టమైన చర్యలతో శాంతిభద్రతలను పరిరక్షిస్తున్నారు.**



**జనపదం, వికారాబాద్ బ్యూరో**

వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ కు చేదు అనుభవం ఎదురయ్యింది. రైతుల నుండి నిరసన సెగ తగలడంతో పాటు ఆయన ప్రయాణిస్తున్న కారుపై లగచర్ల గ్రామస్తులు రాళ్లు విసిరారు. ఫార్మా విలేజ్ కోసం భూములు ఇచ్చే రైతులతో చర్చించేందుకు స్థానిక తహసీల్దారు, కొడంగల్ ఏరియా డెవలప్ మెంట్ అథారిటీ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డితో కలిసి కలెక్టర్ సోమవారం మధ్యాహ్నం గ్రామానికి వెళ్లారు. అదే సమయంలో రైతులు కారుపై రాళ్లతో దాడి చేశారు. ఫార్మా విలేజ్ భూసేకరణలో భాగంగా రైతులతో చర్చించేందుకు లగచర్ల గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో అధికారులు గ్రామసభను పెట్టారు. సభ వద్ద భారీగా పోలీసులను మోహరించారు. ఊరి బయట చర్చలకు ఏర్పాట్లు చేయడంపై రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారు. కలెక్టర్‌తో చర్చకు గ్రామం వెలుపల ఏర్పాటు చేసిన గ్రామసభకు రైతులు గైర్హాజరయ్యారు. గ్రామసభ వద్ద ఇద్దరు రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో కలెక్టర్ గ్రామానికి వెళ్లగా, కలెక్టర్ గ్రామానికి రాగానే రైతులు ......(తరువాయి 2లో)

## నాపై దాడి చేయలేదు..

**వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్**

2

## పిచ్చోడి చేతిలో రాయి..

- రేవంత్ పాలన అస్తవ్యస్తం..
- ఫార్మా సిటీ పేరుతో పచ్చని పొలాలను నాశనం చేస్తున్నారు
- సొంత సెగ్మెంట్లోనే రైతులు తిరుగబడ్డారు
- దిగుబడి కొనలేని దుస్థితిలో కాంగ్రెస్..
- మాజీ మంత్రి హరీశ్ రావు
- కాంగ్రెస్ సర్కార్ పై ఫైర్...

2

## కలెక్టర్‌పై మహిళా రైతు దాడి..?

- మరో అధికారిని ఉరికించిన గ్రామస్తులు..
- రసాభాసగా ఫార్మా కంపెనీ ప్రజాభిప్రాయ సేకరణ..
- బందోబస్తు వైఫల్యంతోనే ఘటన..?
- వికారాబాద్ జిల్లాలో ఉద్రిక్తత

2



## దాడి దారుణం..

- పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి
- డీజీపీకి ఫిర్యాదు చేస్తాం
- తెలంగాణ ఉద్యోగుల జాక్ చైర్మన్ వి.లచ్చిరెడ్డి
- నేడు పెన్ డౌన్ కు కలెక్టరేట్ సిబ్బంది పిలుపు

2




# ఇక బజ్జో..

## ఫాం హౌస్ లో రెస్ట్ తీసుకో కేసీఆర్..

## ఇక నీ దుక్నం బంద్

- తెలంగాణ సమాజం మర్చిపోయింది..
- ఇప్పటికైనా మంచి పనులకు మద్దతివ్వు..
- బడి ఎగ్గొట్టినట్లు అసెంబ్లీకి రావడం లేదు
- కేసీఆర్ ఇంట్లో నాలుగు ఉద్యోగాలు తప్ప
- కొందరు సారాబుడ్లతో దీపావళి చేసుకున్నారు
- రాష్ట్రంలో ఎలక్ట్రానిక్ వాహనాల కోసం పాలసీ తీసుకువస్తాం
- ఏఎంవీఐలకు నియామక పత్రాల జారీ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి

**జనపదం, బ్యూరో:**

మాజీ సీఎం కేసీఆర్ను తెలంగాణ సమాజం మరిచిపోయిందని, ఆయన ఇక ఫాంహౌస్కే పరిమితం కావాలని సీఎం రేవంత్రెడ్డి అన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ దుకాణం బంద్ అయిందన్నారు. ''బడికి ఎగ్గొట్టే వారిని చూసే ఉంటాం.. కానీ తెలంగాణలో అసెంబ్లీకి ఎగ్గొట్టి ఇంటికి పరిమితమయ్యే వారిని చూస్తున్నాం. ఇదేనా ప్రజలు మీకు ఇచ్చిన బాధ్యత.. మీ పని అయిపోయింది.. తెలంగాణ సమాజం మొత్తం ఎప్పుడో మరిచిపోయింది..'' అంటూ మాజీ కేసీఆర్ ను ఉద్దేశించి సీఎం రేవంత్ రెడ్డి సెటైరికల్ కామెంట్స్ చేశారు. ఖైరతాబాద్ ఆర్టీఏ కార్యాలయం ఆవరణలో కొత్తగా ఎంపికైన ......(తరువాయి 2లో)

## రైతులను ఇబ్బంది పెట్టొద్దు..

**అవసరమైతే వ్యాపారులపై ఎస్మా తప్పదు..**
**ధాన్యం కొనుగోళ్లపై సీఎం రేవంత్ స్ట్రాంగ్ వార్నింగ్**

2



## ఇప్పుడు నేతల వంతు...

**ట్యాపింగ్ లో కేసులో కీలక పరిణామం...**
**మాజీ ఎమ్మెల్యే లింగయ్యకు నోటీసులు..**
**జూబ్లీహిల్స్ పీఎస్‌కు రావాలని ఆదేశం**
**అనారోగ్యంతో రాలేనని రిప్లై**
**14న హాజరవుతానని సమాచారం**
**ఫోన్ ట్యాపింగ్ లో మరో సంచలనం..**

4

భయమెందుకో..?

## అమృత్ లో అవినీతి..?



- నేను ఢిల్లీకొస్తే రేవంత్ కు వణుకెందుకు..?
- అవినీతి, అక్రమాలపై కేంద్రానికి ఫిర్యాదు
- రాష్ట్రంలో పరిపాలనా వైఫల్యం..
- సీఎం సెగ్మెంట్లోనే రైతులు తిరుగబడ్డారు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**జనపదం, హైదరాబాద్ బ్యూరో:**

నేను ఢిల్లీలో కాలు పెట్టానో లేదో... అప్పుడే రేవంత్ సర్కార్ భయపడితే ఎలా అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా సెటైర్లు వేశారు. ఇలా ఢిల్లీలో అడుగుపెట్టాను.. అప్పుడే హైదరాబాద్ ప్రకంపనలు ప్రారంభమైనట్లు తెలిసిందన్నారు. రేవంత్ అవినీతి, అక్రమాలపై కేంద్రానికి ఫిర్యాదు చేసేందుకు కేటీఆర్ సోమవారం మధ్యాహ్నం ఢిల్లీకి వెళ్లిన సంగతి తెలిసిందే. అమృత్ పథకం టెండర్లలో రేవంత్ తన బావమరది సృజన్ రెడ్డికి లాభం చేకూర్చేలా అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని, ఇప్పటికే ......(తరువాయి 2లో)

బాంబేమిటో..?

## లాబీయింగ్ కే ఢిల్లీకి..



- పేల్చబోయే బాంబేంటో కేటీఆర్ కు బాగా తెలుసు
- ఫార్ములా - ఈరేసింగ్ వ్యవహారంలో కేటీఆర్ ను ప్రశ్నిస్తారు
- గవర్నర్ అనుమతి కోసం వేచి చూస్తున్నాం
- మంత్రి పొంగులేటి తీవ్ర విమర్శలు

**జనపదం, ఖమ్మం :**

ఫార్ములా – ఈరేసింగ్ నిర్వహణకు బీఆర్ఎస్ నేత, అప్పటి మున్సిపల్ శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు విదేశాల్లోని సంస్థలకు రూ.55కోట్లను ఏవిధంగా మళ్లించారని ఈ కేసులో ఆయన్ను ఏసీబీ ప్రశ్నిస్తుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ కేసు విషయంపై ఇప్పటికే గవర్నర్ అనుమతి కోసం వేచి చూస్తున్నామని పేర్కొన్నారు. ఖమ్మం రూరల్ మండలం చిన్న వెంకటగిరిలో జరిగిన మీడియా సమావేశంలో కేటీఆర్ లక్ష్యంగా మంత్రి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కేటీఆర్ ఎక్కడున్నారు? ఎందుకు ......(తరువాయి 2లో)



## నిర్మల్‌లో పెద్దపులి

**జనపదం,నిర్మల్:** నిర్మల్ జిల్లాలో పెద్దపులి సంచారం కలకలం రేపుతోంది. కొన్ని రోజులుగా కుంటాల మండలంలో పలు జంతువులపై దాడి చేసి చంపివేసింది. తాజాగా సోమవారం తెల్లవారు జామున సారంగాపూర్ మండలం మహబూబ్ ఘాట్స్ పై సంచరిస్తూ రోడ్డు దాటుతుండగా అటుగా కారులో వెళుతున్న యువకులకు పెద్దపులి కనిపించింది. పెద్దపులి రోడ్డు దాటుతున్న విషయాన్ని గుర్తించి యువకులు వీడియో తీశారు. అనంతరం ఫారెస్ట్ అధికారులకు పెద్దపులి సంచారం విషయాన్ని అందజేశారు. ఈ మేరకు అటవీ అధికారులు ఘటనా స్థలికి చేరుకున్నారు. ఆదిలాబాద్ వైపు వెళ్లే వాహనాలను నిర్మల్ వైపు తిప్పి పంపిస్తూ బైపాస్ రోడ్డు గుండా వాహనాలు వెళ్లాలని రోడ్డు మార్గాన్ని డైవర్ట్ చేశారు.

## లాబీయింగ్ కే ఢిల్లీకి..

**(మొదటిపేజీ తరువాయి)** ఢిల్లీకి వెళ్లారు? ఎవరి కాళ్లు మొక్కి ఏం లబ్ధిపొందుదామని వెళ్లారు? అని ప్రశ్నించారు. లిక్కర్ స్కాం కేసులో కేంద్రం పెద్దలను ఒప్పించి తన చెల్లి బెయిల్ పొందినట్లుగానే తనను తాను కాపాడుకునేందుకు మళ్లీ ఢిల్లీ వెళ్లారా అని అన్నారు. కేబినేట్ అప్రూవల్ ముఖ్యమంత్రి అప్రూవల్ లేకుండా కేటీఆర్ విదేశాల్లోని తొత్తు సంస్థలకు నిధులు మళ్లించారని ఆరోపించారు. ఫార్ములా – ఈరేసింగ్ నిర్వహణలో నిధుల దుర్వినియోగం అంశంపై విచారణను రాష్ట్ర ప్రభుత్వం ఏసీబీకి అప్పగించిందన్నారు. ఈరేసింగ్ నిర్వహణకు సంబంధించిన కంపెనీతో ఎం ఓ యు కుదుర్చుకోక మునుపే కేటీఆర్ నిధులను మళ్లించారన్నారు. ఎవరి అనుమతి తీసుకోకుండా ఎవరికోసం 55 కోట్ల రూపాయల ప్రజాధనాన్ని మళ్లించారని మంత్రి పొంగులేటి ప్రశ్నించారు. ప్రజాప్రతినిధిని అదుపులోకి తీసుకుని విచారించాలంటే దర్యాప్తు సంస్థలకు రాష్ట్ర గవర్నర్ అనుమతి ఉండాలని ముందస్తుగా ఏసీబీ అనుమతి కోరిందని తెలిపారు. రేపో మాపో గవర్నర్ అనుమతి వస్తుందని ముందే గ్రహించిన కేటీఆర్ హైదరాబాద్ నుంచి ఢిల్లీకి తన బేస్ మార్చారని ఆరోపించారు. అంబానీ, అదానీ, ఆర్ఎస్ఎస్, బీజేపీ పెద్దలను కలిసి తనను ఫార్ములా –ఈరేసింగ్ కేసు నుంచి తప్పించాలని ప్రాధేయపడేందుకే వెళ్లారని పేర్కొన్నారు. అందుకు సంబంధించిన అన్ని ఆధారాలు మా దగ్గర ఉన్నాయని మంత్రి పొంగులేటి వివరించారు. నేను పేల్చబోయే బాంబేంటో కేటీఆర్ కు తెలుసన్నారు. గత ప్రభుత్వం పదేళ్ల హయాంలో చేసిన అవినీతి బాగోతాన్ని వెలికితీస్తే భూమి మీద నుంచి అంతరిక్షంకు వెళ్లి దాక్కునేలా ఉన్నారని అన్నారు. కేంద్రపట్టణాభివృద్ధి శాఖ మంత్రిని కలిసి తనపై కేసు కాకుండా చూడాలని కేటీఆర్ ప్రాధేయపడుతున్నారన్నారని మంత్రి పొంగులేటి తెలిపారు.

## రైతులను ఇబ్బంది పెట్టొద్దు

**అవసరమైతే వ్యాపారులపై ఎస్మా తప్పదు..**

**ధాన్యం కొనుగోళ్లపై సీఎం రేవంత్ స్ట్రాంగ్ వార్నింగ్**

**జనపదం, బ్యూరో:** ధాన్యం కొనుగోళ్ల విషయంలో రైతులను ఇబ్బందిపెట్టే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అలాంటి వ్యాపారులపై అవసరమైతే ఎస్మా (ఎసెన్షియల్ సర్వీసెస్ మెయింటెనెన్స్ యాక్ట్) చట్టం కింద చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్న ఘటనలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. ఈ సమస్యలపై సంబంధిత అధికారులతో మాట్లాడారు. రైతుల పంట కొనుగోళ్లలో మోసాలకు పాల్పడితే సహించేది లేదని సీఎం హెచ్చరించారు. రైతులను గందరగోళానికి గురి చేయటం, వేధించటం వంటి ఘటనలపై కఠినంగా వ్యవహరించాలని అధికారులకు ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రమంతటా ధాన్యం కొనుగోళ్లు సాఫీగా జరిగేలా అన్ని జిల్లాల కలెక్టర్లు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడైనా ఇబ్బందులు తలెత్తితే వెంటనే ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. గ్రామాల్లో ధాన్యం కొనుగోళ్లపై అంతగా దృష్టి సారించకపోవడం, కొనుగోలు కేంద్రాల వద్ద మౌలిక వసతులు లేకపోవడం వల్ల అన్నదాతలకు ఇబ్బందులు తప్పడం లేదు. నిబంధనల సాకుతో నిర్వాహకులు, మిల్లర్లు దోపిడీకి పాల్పడుతున్నారని రైతులు వాపోతున్నారు. మరోవైపు ధాన్యం తరలించేందుకు కావల్సిన గోనె సంచుల కొరత, తూకం ఆలస్యంగా వేయడం, ధాన్యం తీసుకెళ్లేందుకు వాహనాలు లేకపోవడం వంటి కారణాలు రైతులకు ఇబ్బందులను తెచ్చిపెడుతున్నాయి. దీనికి అప్పుడప్పుడు కురిసే అకాల వర్షాలతో కూడా రైతులకు నష్టం తప్పడం లేదు. దీనిపై పలు ఫిర్యాదులు రావడంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇవాళ సమీక్ష నిర్వహించారు. రైతులను ఇబ్బంది పెట్టవద్దని, ధాన్యం కొనుగోళ్లు, తరలింపు వెంట వెంటనే జరగాలని, ఎక్కడైనా జాప్యం జరిగితే వ్యాపారులతో బాధ్యత అని హెచ్చరించారు. కొనుగోళ్లు జరుగుతున్న తీరును పరిశీలించి, ఏమైనా సమస్యలుంటే అక్కడికక్కడే పరిష్కరించాలన్నారు. అయితే అక్కడక్కడ ధాన్యం కొనుగోళ్ల విషయంలో రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. తేమశాతం, తూకం విషయంలో కొందరు వ్యాపారులు రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు తెలిసిందని, ఈ ఘటనలపై తీవ్ర పరిణామాలుంటాయని సీఎం రేవంత్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ఎమ్మెల్యే పాదయాత్ర ఎందుకు..?

**కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ నర్సింగరావు**

**జనపదం, కోరుట్ల:** రైతుబంధు, రైతు బీమా, రైతు రుణమాఫీ అంటూ కోరుట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ పాదయాత్ర చేపట్టడం విడ్డూరంగా ఉందని రైతులను పక్క దోవ పట్టించి లబ్ధి పొందేందుకే పాదయాత్ర తప్ప రైతులకు మేలు చేసేందుకు కాదని కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు అన్నారు. ఈ సందర్భంగా సోమవారం కోరుట్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నర్సింగరావు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తెలంగాణ మిగులు బడ్జెట్ గా ఉన్న రాష్ట్రాన్ని గడిచిన పదేళ్లలో అప్పుల కుప్పగా చేసిన ఘనత బీఆర్ఎస్ పార్టీ, కల్వకుంట్ల కుటుంబానిదేనని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కోరుట్ల నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కల్వకుంట విద్యాసాగర్ రావు 100 రోజుల్లోనే ముత్యంపేట చక్కర కర్మాగారాన్ని తెరిపిస్తానని, లేదంటే గేటుకి ఉరివేసుకుంటానని, చెప్పి నియోజకవర్గ రైతులను ప్రజలను మోసం చేశాడన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం గత ఎన్నికల్లో వచ్చిన హామీ ప్రకారం ముత్యంపేట చక్కర కర్మాగారం కోసం ఏర్పాటు చేసిన కమిటీ కర్మాగారాన్ని సందర్శించడం కూడా జరిగిందని, త్వరలోనే నిధులు మంజూరు చేసి కర్మాగారాన్ని పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకొస్తామన్నారు. త్వరలోనే అర్హులైన రైతులందరికీ తప్పకుండా రుణమాఫీ చేసి తీరుతామని చెప్పారు.

# పిచ్చోడి చేతిలో రాయి..

- రేవంత్ పాలన అస్తవ్యస్తం..
- ఫార్మా సిటీ పేరుతో పచ్చని పొలాలను నాశనం చేస్తున్నారు
- సొంత సెగ్మెంట్లోనే రైతులు తిరుగబడ్డారు
- రాష్ట్రవ్యాప్తంగా పత్తి కొనుగోళ్లు ఆగాయి
- దిగుబడి కొనలేని దుస్థితిలో కాంగ్రెస్..
- మాజీ మంత్రి హరీశ్ రావు
- కాంగ్రెస్ సర్కార్ పై ఫైర్...



**జనపదం, సిద్దిపేట:** గరీబీ హటావో అని ఇందిరా గాంధీ పిలుపునిస్తే ఫార్మా సిటీ పేరుతో పచ్చని పంట పొలాల నుండి కిసాన్ హటావో అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిస్తున్నారని బీఆర్ఎస్ అగ్రనేత, మాజీ మంత్రి హరీశ్ రావు ఎద్దేవా చేశారు. అసత్య హామీలతో అధికారాన్ని చేపట్టిన రేవంత్ పాలన పిచ్చోడి చేతిలో రాయిలా తయారైందన్నారు. ఆ రాయి ఈ రోజు సీఎం సొంత జిల్లా వికారాబాద్ రైతన్నల నెత్తిన పడిందన్నారు. అందుకే రైతులు రేవంత్ మీద ఉన్న కోపాన్ని కలెక్టర్, ప్రభుత్వ అధికారుల మీద చూపుతున్నారని సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రేవంత్ చేస్తున్న అసమర్థ పాలనకు ఐఏఎస్ లు, ప్రభుత్వ అధికారులు ప్రజాగ్రహానికి గురవుతున్నారన్నారు. ఫార్మా సిటీ కోసం కేసీఆర్ హైదరాబాద్ కు దగ్గరగా, కాలుష్యం లేకుండా, జీరో వ్యర్థాలతో 15 వేల ఎకరాలు సేకరించి సిద్ధం చేసిన విషయాన్ని ఈ సందర్భంగా హరీశ్ రావు గుర్తు చేశారు. పర్యావరణం, అటవీ సహా అన్ని రకాల అనుమతులు వచ్చిన దాన్ని పక్కన బెట్టి పచ్చటి పొలాల్లో ఫార్మా చిచ్చు బెడుతున్నాడని ధ్వజమెత్తారు. జహీరాబాద్ న్యాల్కల్ మండలంలోనూ దాదాపు ఇదే పరిస్థితి అని అన్నారు. ఫార్మా సిటీ కోసం సేకరించిన భూమిని తన రియల్ ఎస్టేట్ దందా కోసం వినియోగించే కుట్రతో ఈ సమస్య మొదలైందన్నారు. రాష్ట్రంలో రేవంత్ పాలన తిరగబడని వర్గం ఏదైనా ఉందా..? అని ప్రశ్నించారు. ఇప్పటికైనా పిచ్చి పనులు మాని పరిపాలన మీద దృష్టి పెట్టాలని, పచ్చని పొలాల్లో ఫార్మా కంపెనీ ఏర్పాటు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని బీఆర్ఎస్ పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నామన్నారు.

### పత్తి కొనుగోళ్లు నిలిచిపోయాయి

రాష్ట్ర వ్యాప్తంగా పత్తి కొనుగోళ్ళు నిలిచిపోవడం, కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం పట్ల హరీష్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అకాల వర్షాలతో దిగుబడి తగ్గి ఇప్పటికే నష్టపోయిన పత్తి రైతులకు, కొనుగోళ్ల విషయంలో ప్రభుత్వం చూపుతున్న నిర్లక్ష్యం శాపంగా మారడం శోచనీయమన్నారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంటను కనీస మద్దతు ధరకు కూడా అమ్ముకోలేని దుస్థితికి తెలంగాణ రైతాంగాన్ని చేర్చిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని విమర్శించారు. సీసీఐ, రాష్ట్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా పత్తి కొనుగోలు చేయబోమని రాష్ట్ర జిన్నింగ్, మిల్లుల యాజమాన్యాలు ప్రకటిస్తే సమస్యకు పరిష్కారం చూపే కనీస ప్రయత్నం చేయకపోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. పత్తి రైతులు రోడ్డెక్కి లబోదిబోమంటుంటే అసలు రాష్ట్రంలో ప్రభుత్వం ఉన్నట్లా.. లేనట్లా? అని ప్రశ్నించారు. రాష్ట్ర మార్కెటింగ్ శాఖ అలసత్వం, సమన్వయ లోపంతో పత్తి రైతులు చిత్తవుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడన్నారు. పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఫొటోలకు ఫోజులిచ్చిన మంత్రులు ఎందుకు మౌనంగా ఉన్నారని నిలదీశారు. పంట చేతికి వచ్చిన ఈ సమయంలో రైతుల జీవితాలతో చెలగాటమాడటం ఏమిటన్నారు. మిల్లుల వద్దకు చేరిన పత్తి లారీల లోడ్లతో రైతులు ఎన్ని రోజులు ఎదురుచూడాలని, పక్క రాష్ట్రాల ఎన్నికల ప్రచారాల్లో పాల్గొనడానికి సమయం ఉన్న ముఖ్యమంత్రి, మంత్రులకు రైతుల సమస్యలు పట్టించుకునే సమయం లేదా అన్నారు. తేమ శాతం సడలింపు, కొత్త నిబంధనల విషయమై ఢిల్లీకి వెళ్లి సీసీఐ అధికారులకు విజ్ఞప్తి చేసే తీరిక లేదా అని హరీష్ రావు మండిపడ్డారు.

# ఇక్ బజ్జో..

**(మొదటిపేజీ తరువాయి)** అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్ స్పెక్టర్లకు నియామక పత్రాలను అందజేసే కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, పలువురు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతనంగా అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్ స్పెక్టర్ ఉద్యోగాలకు నియమితులైన వారికి నియామక పత్రాలు అందజేసిన అనంతరం సీఎం మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రాన్ని నిరుద్యోగ యువత, ఉద్యోగాలను సాధించుకోవాలన్న లక్ష్యంతో సాధించుకున్నారన్నారు. కానీ గత ప్రభుత్వం నిరుద్యోగులకు ఉద్యోగ కల్పన కల్పించే విషయంలో పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరించి, వారి గురించి ఆలోచించిన పరిస్థితి లేదన్నారు. దీనితో తాను ఎన్నికల సమయంలో మిమ్మల్ని నమ్మించిన వారి ఉద్యోగా లు ఊడగొట్టండి.. మీకు ఉద్యోగాలు వస్తాయని హామీ ఇచ్చానని, అధికారంలోకి వచ్చిన మరుక్షణం 10 నెలల్లో 50 వేల ఉద్యోగాలు అందించినట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. గ్రూప్–1 పరీక్షను తెలంగాణలో 12 ఏళ్లుగా నిర్వహించలేదని, తమ ప్రభుత్వం వచ్చిన అనంతరం 563 ఉద్యోగాలకు నోటిఫికేషన్ ప్రకటించి ఎన్ని కష్టాలు ఎదురైనా చిట్టచివరకు పరీక్షలను విజయవంతంగా నిర్వహించామన్నారు.

### గత పాలకులు గుర్తు లేరు..

మాజీ సీఎం కేసీఆర్ లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి సెటైరికల్ కామెంట్స్ చేశారు. బడికి ఎగ్గొట్టే వారిని చూసి ఉంటామని, కానీ నేడు ప్రజలు ఇచ్చిన బాధ్యతను కూడా మరిచి అసెంబ్లీకి రాని వారిని తెలంగాణ రాష్ట్రంలో చూస్తున్నామన్నారు. అసెంబ్లీకి రావాలని తాము పదేపదే కోరాల్సిన పరిస్థితి ఏర్పడిందని, తెలంగాణ సమాజం గత పాలకులను ఎప్పుడో మరిచిపోయిందంటూ విమర్శించారు. కొంతమంది దీపావళి పండుగ రోజు చిచ్చుబుడ్లకు బదులుగా, సారా బుడ్లతో దీపావళి పండుగను జరుపుకుంటున్నారని, ఇటువంటి వారిని సామాజిక బహిష్కరణ చేయాలన్నారు. కేసీఆర్ వాస్తు కోసం సచివాలయం, ప్రగతి భవన్ కట్టుకుండు కానీ.. రెసిడెన్షియల్ స్కూల్స్ ఒక్కటి కూడా నిర్మించలేదన్నారు. రాష్ట్రానికి ఇటువంటి వారు ఆదర్శమా అంటూ ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రం కోసం ప్రాణాలు అర్పించిన శ్రీకాంత్ ఆచారి ఇ షాంత్ రెడ్డి వారిని ఆదర్శంగా తీసుకోవాలా లేదా అన్నది సమాజం ఆలోచించాలన్నారు. పక్క రా ష్ట్రాల నుండి వస్తున్న గంజాయి రవాణాను అడ్డుకోవడంలో రవాణా శాఖ కీలకపాత్ర పోషించిందని, నూతన ఉద్యోగాలకు ఎంపికైన వారు తమ విధి నిర్వహణలో, మంచి పేరు ప్రఖ్యాతులు సాధించాలన్నారు.

### ఏం కోల్పోలేదు..
### మీ ఉద్యోగాల తప్ప..

ఉద్యోగాల కోసం నిరుద్యోగులు అప్పట్లో ప్రత్యేక తెలంగాణ ఉద్యమం బాట పట్టారని, కానీ గత ప్రభుత్వ పెద్దలు నిరుద్యోగుల గురించి ఎప్పుడూ ఆలోచించలేదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తమ ప్రభుత్వ హయాంలో 50 వేల ఉద్యోగ నియామక



పత్రాలు అందించామని తెలిపారు. నిరుద్యోగులకు నియామక పత్రాలు అందించడం తనకు సంతృప్తిని ఇస్తుందన్నారు. 10 నెలల్లో ఏం కోల్పోయిందో ప్రజలు తెలుసుకున్నారని ఒక పెద్దాయన అంటున్నారని, తెలంగాణ ఏం కోల్పోలేదని, ఆ పెద్దాయన ఇంట్లో నలుగురు ఉద్యోగాలు కోల్పోయారని సీఎం రేవంత్ విమర్శించారు. గత ప్రభుత్వం రెసిడెన్షియల్ స్కూల్ ఒక్కటైనా కట్టిందా అని ప్రశ్నించారు. రెసిడెన్షియల్ స్కూల్ కట్టలేదు కానీ ఆయన మాత్రం 10 ఎకరాల్లో ఫామ్‌హౌస్ కట్టుకున్నారని అన్నారు. 2011లో రాష్ట్రంలో చివరిసారిగా గ్రూప్–1 నిర్వహించారని దాదాపు 13 ఏళ్లపాటు గ్రూప్–1 నిర్వహించలేదని తెలిపారు. ఎన్ని ఆటంకాలు పెట్టినా పట్టుబట్టి గ్రూప్–1 పరీక్షలు నిర్వహించానని త్వరలో గ్రూప్–1 నియామకపత్రాలు అందజేస్తాని తెలిపారు. ఉద్యోగాల కోసం నిరుద్యోగులు అప్పట్లో ప్రత్యేక తెలంగాణ ఉద్యమం బాట పట్టారని కానీ గత ప్రభుత్వ పెద్దలు నిరుద్యోగుల గురించి ఎప్పుడూ ఆలోచించలేదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ప్రజాప్రతినిధులు ప్రజలకు ఆదర్శంగా ఉండాలని, డ్రగ్స్ తీసుకుంటూ దొరికినా మమ్మల్ని పట్టుకోవద్దని దబాయిస్తున్నారని సీఎం మండిపడ్డారు. ఫామ్‌హౌస్‌లో కొందరు మద్యం సేవించి దీపావళి చేసుకుంటున్నారని, చిచ్చుబుడ్లకు బదులు సారాబుడ్లతో కొందరు దీపావళి జరుపుకుంటున్నారని సెటైర్ వేశారు.

# దాడి దారుణం..

- పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి
- డీజీపీకి ఫిర్యాదు చేస్తాం
- తెలంగాణ ఉద్యోగుల జాక్ చైర్మన్ వి.లచ్చిరెడ్డి
- నేడు పెన్ డౌన్ కు కలెక్టరేట్ సిబ్బంది పిలుపు

**జనపదం, వికారాబాద్ సిటీ:** వికారాబాద్ జిల్లాలో కలెక్టర్, అదనపు కలెక్టర్, ఇతర రెవెన్యూ అధికారులపై జరిగిన దాడిని తీ వ్రంగా ఖండిస్తున్నట్టుగా తెలంగాణ ఉద్యో గుల జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మె న్ వి.లచ్చిరెడ్డి తెలిపారు. కలెక్టర్, ఇతర సిబ్బందిపై దాడి జరగడం దారుణమైన చర్య అని, దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అధికారులపై దాడికి ఉసిగొల్పినవారిపైనా, పాల్పడిన వారిపైనా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డీజీపీకి ఫిర్యాదు చేస్తామని చెప్పారు. ఈ మేరకు సోమవారం తెలంగాణ ఉ ద్యోగుల జాక్ కమిటీ నేతలతో కలిసి లచ్చిరెడ్డి మాట్లాడారు. సోమవారం వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం లగచర్ల గ్రామంలో జరిగిన గ్రామసభలో ఫార్మా కంపెనీ భూసేకరణకు సంబంధించి ప్రజాభిప్రాయాన్ని స్వీకరించడానికి అధికారులు వెళ్ళారని చెప్పారు. ప్రజాభిప్రాయ స్వీకరణ సమయంలోనే కొందరు అధికారులపై దాడులు చేసి, వాహనాలను ధ్వంసం చేశారన్నారు. ఇలాంటి దాడులతో ఉద్యోగులు భయాందోళనలకు గురవుతున్నారని, ప్రభుత్వం వెంటనే స్పందించి రక్షణ కల్పించాలని కోరారు.

### నేడు పెన్ డౌన్ కు పిలుపు..

కలెక్టర్, ఇతర అధికారులపై జరిగిన దాడికి నిరసనగా మంగళవారం పెన్ డౌన్ కార్యక్రమం చేపడతామని వికారాబాద్ జిల్లా కలెక్టరేట్ ఉద్యోగులు ప్రకటించారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయానికి తాళంవేసి నిరసనకు దిగారు. ఏకంగా కలెక్టర్ పైనే దాడి చేస్తే తమ పరిస్థితి ఏమిటని ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేశారు.

## ఫార్మా.. ఫైర్..?!

**(మొదటిపేజీ తరువాయి)** ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కలెక్టర్ ప్రతీక్ జైన్ వెనక్కి వెళ్లాలని కారుపై రాళ్లు విసిరారు. దీంతో కారు అద్దాలు పగిలాయి. ఓ మహిళ కలెక్టర్ ప్రతీక్ జైన్ పై చేయి చేసుకున్నట్లు తెలుస్తోంది. దాడిలో మూడు వాహనాలు ధ్వంసం అయ్యాయి. ఆ వెంటనే అధికారులంతా అక్కడి నుంచి వెళ్లేపోయే ప్రయత్నం చేశారు. ప్రస్తుతం లగచర్లలో ఉద్రిక్త వాతావరణం నెలకొనగా భారీగా పోలీసులు మోహరించారు.

### సీఎం రేవంత్ ఇలాకాలో తీవ్ర ఉద్రిక్తత..

తీవ్రమైన ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో పోలీసులు గ్రామంలో భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. ఫార్మా కంపెనీకి భూసేకరణ నిమిత్తం ఉన్నతాధికారులు ఏర్పాటు చేసిన ప్రజాభిప్రాయ సేకరణ రసాభాసగా మారింది. సీఎం రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గమైన కొడంగల్ లో మరోసారి తీవ్రమైన ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇటీవల ఫార్మా కంపెనీ ఏర్పాటు కోసం భూసేకరణకు వెళ్లిన నాయకులపై గ్రామ రైతులు దాడికి పాల్పడిన ఘటన నేపథ్యంలో ప్రజాభిప్రాయ సేకరణను వాయిదా వేసి తిరిగి సోమవారం నిర్వహించేందుకు ప్రయత్నించిన ఉన్నతాధికారులకు చేదు అనుభవం ఎదురైంది. వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం బొంరాస్పేట్ మండలం లగచర్ల గ్రామంలో ఫార్మా కంపెనీ ఏర్పాటు నిమిత్తం భూసేకరణ కోసం ప్రజాభిప్రాయ సేకరణ కోసం సమావేశానికి సిద్ధమైన అధికారులపై గ్రామానికి చెందిన రైతులు ఏకంగా దాడులకు పాల్పడ్డారు. ఏకంగా జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, కొడంగల్ డెవలప్ మెంట్ అథారిటీ అధికారి (కడ) వెంకటరెడ్డి వాహనాలపై రైతులు దాడులకు పాల్పడి కారు అద్దాలను ధ్వంసం చేశారు. రెండు కార్ల అద్దాలు ధ్వంసం కావడంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో పోలీసులు హుటాహుటిన లగచర్ల గ్రామంలో పెద్ద ఎత్తున బందోబస్తు ఏర్పాటు చేశారు.

### ఘటన పూర్తి వివరాలిలా..

సోమవారం ప్రజాభిప్రాయ సేకరణ కోసం బొమ్రాస్ పేట్ మండలం లగచర్ల గ్రామానికి వెళ్ళిన కలెక్టర్ ప్రత్యేక అధికారి రెవిన్యూ అధికారులపై గ్రామ రైతులు ఏకంగా రాళ్లు కర్రలతో దాడి చేయడం గమనార్హం. తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న సందర్భంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ రైతులను గ్రామస్తులను నిలువరించేందుకు ప్రయత్నించగా వెనుక వైపు నుంచి ఓ మహిళ దాడి చేసినట్లు సమాచారం. సోమవారం ఫార్మా కంపెనీ ఏర్పాటు కోసం భూసేకరణ విషయమై రైతులతో చర్చించేందుకు కలెక్టర్ నేతృత్వంలో ప్రత్యేకంగా బొమ్రాస్పె పేట్ మండల శివారులో ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించే సమా వేశ స్థలికి వెళ్లగా ఫార్మా కంపెనీ ఏర్పాటు చేసేందుకు స్థలం సేకరించాలని నిర్ణయించిన లగచర్ల గ్రామంలోనే ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించాలని అక్కడికి వెళ్లిన కొందరు రైతులు కలెక్టర్ తో వాగ్వాదానికి దిగారు. దీంతో లగ్గిచర్ల గ్రామంలోనే ప్రజాభిప్రాయ సేక రణ నిర్వహిచేందుకు వెళ్లిన కలెక్టర్, కడ ప్రత్యేక అధికారి వాహనాలపై రైతులు, గ్రామస్తులు కొందరు మూకుమ్మడిగా దాడులకు తెగబడ్డారు. కలెక్టర్ అధికారులతో కలిసి గ్రామంలోకి వెళ్లేందుకు ప్రయత్నిస్తున్న సందర్భంలో గ్రామస్తులు ఒక్కసారిగా అధికారులు గో బ్యాక్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ అధికారులపై మూకుమ్మడిగా విరుచుకుపడ్డారు. వారు ఏకంగా కలెక్టర్ కారు అద్దాలను ధ్వంసం చేయడం గమనార్హం. శివారులో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించేందుకు కలెక్టర్ ప్రతిక్ జైన్ , కడ అధికారి వెంకట్ రెడ్డి, వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ లింగ్య నాయక్, తాండూర్ రెవిన్యూ డివిజన్ సబ్ కలెక్టర్ ఉమాశంకర్ తదితరులు బొమ్మరాస్ పెట్ గ్రామ శివారుకు వెళ్లగా లగిచర్ల గ్రామంలోనే ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించాలని డిమాండ్ చేసిన రైతులు అధికారులను నమ్మించి దాడికి తెగబడటం గమనార్హం. బొమ్మరాస్ పేట్ శివారులో కాకుండా లగిచర్ల గ్రామంలోనే ప్రజానాభిప్రాయ సేకరణ జరపాలని అధికారులను నమ్మించిన రైతులు ఈ దాడులు చేయడంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి తన కారుపై దా డులకు పాల్పడడంతో పొలాల గుండా ఆత్మరక్షణ కోసం పరుగులు తీయడం గమనార్హం. దీంతో సమాచారం అందుకున్న పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేసి పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

# అమృత్ లో అవినీతి..?

**(మొదటిపేజీ తరువాయి)** ఈ విషయం లేఖ ద్వారా కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ దృష్టికి తీసుకెళ్ళడం జరిగింది. ఇప్పుడు కేంద్ర మంత్రిని నేరుగా కలిసి ఈ విషయంపై ఫిర్యాదు చేసేందుకు కేటీఆర్ ఢిల్లీకి వెళ్లారు. దీనిపై కాంగ్రెస్ నేతలు విమర్శలు చేయడంతో కేటీఆర్ పై విధంగా స్పందించారు.

### పరిపాలన వైఫల్యమే..

రాష్ట్రంలో పరిపాలనా వైఫల్యం, శాంతిభద్రతల వైఫల్యానికి తాజా ఉదాహరణ రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్‌లో ఏకంగా జిల్లా కలెక్టర్ మీదనే రైతులు తిరగబడ్డారన్నారు. సీఎం మూర్ఖత్వం వల్ల అధికారులు దెబ్బలు తినాల్సి రావడం దురదృష్టకరమన్నారు. నిజానికి రేవంత్ రెడ్డి దురాశ వల్ల, అవగాహనారాహిత్యం వల్లనే ఈ దుస్థితి దాపురించిందన్నారు. భూసేకరణ పూర్తయ్యి, అన్ని అనుమతులు వచ్చి, ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ఫార్మా సిటీని రద్దు చేసి, రాష్ట్రంలో పదిచోట్ల ఫార్మా క్లస్టర్లు పెట్టాలనే తుగ్లక్ ఆలోచన వల్లనే ఇంత అలజడి రేగిందన్నారు. ఫార్మా సిటీకోసం సేకరించిన భూములు అమ్ముకొని సొమ్ముచేసుకుందామన్న రేవంత్ కుత్సిత బుద్ధి వల్ల ఇప్పుడు ఇక్కడ ఫార్మా సిటీ భవితవ్యం ప్రమాదంలో పడిందన్నారు. అక్కడ కొడంగల్‌లో అన్నదాతల భూములు గుంజుకునే కుట్ర మొదలైందన్నారు.

**రాష్ట్రంలో అన్ని** వర్గాల ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తి, ఆగ్రహం, చాలాచోట్ల కట్టలు తెంచుకుంటోందన్నారు. అది ఈ అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని త్వరలోనే భూస్థాపితం చేయనుందన్నారు. ప్రక్షాళన పేరుతో పేదల ఇండ్లు కూలుస్తున్నా, వాళ్ల గుండెలవిసేలా రోదిస్తున్నా కాంగ్రెస్ అధిష్టానానికి చలనం రాదా ? అని ప్రశ్నించారు. ఎకరాకు ఏడాదికి రూ.15000 , రైతుభరోసా అందక రైతన్నలు పెట్టుబడుల కోసం తిప్పలు పడుతున్నా కాంగ్రెస్ అధిష్టానం ఎందుకు స్పందించదని నిలదీశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.2 లక్షల రుణమాఫీ అని అరకొర రుణమాఫీతో రైతులను అరిగోస పెడుతున్నా కాంగ్రెస్ అధిష్టానం ఎందుకు పట్టించుకోదని మండిపడ్డారు. సాంఘిక సంక్షేమ



గురుకుల పాఠశాలలలో ప్రతిరోజూ ఫుడ్ పాయిజన్ జరిగి విద్యార్థులు ఆసుపత్రుల పాలవుతున్నా కనీసం సమీక్షించరని దుయ్యబట్టారు.

**ఎన్నికలకు ముందు** నిరుద్యోగులను వాడుకుని ఇప్పుడు గ్రూప్ 1,2,3,4 పరీక్షలపై వారు అడుగుతున్న డిమాండ్లను ఎందుకు నెరవేర్చడం లేదని కేటీఆర్ అడిగారు. ఆడబిడ్డలకు మహాలక్ష్మి పథకం కింద నెలకు రూ.2500 ఏమయిందన్నారు. అలాగే అవ్వ, తాతలకు నెలకు రూ.4,000 పింఛన్ ఎప్పటి నుండి ఇస్తారో చెప్పాలన్నారు. రాష్ట్రంలో నడుస్తున్నది ఏసీబీ, జేసీబీ సర్కార్.. కూల్చడం తప్ప నిలబెట్టడం తెలియని కాంగ్రెస్ సర్కార్ అని మండిపడ్డారు.

### ఘనంగా అబుల్ కలాం జయంతి..

మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా తెలంగాణ భవన్ లో పేద ముస్లిం విద్యార్థులకు నోట్ బుక్స్, స్టడీ మెటీరియల్ ను కేటీఆర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మౌలానా అబుల్ కలాం ఆజాద్, దేశ తొలి విద్యాశాఖ మంత్రి జయంతి ఉత్సవాలను తెలంగాణలో భవన్ లో నిర్వహించటం సంతోషంగా ఉందన్నారు. 2014 లో తెలంగాణ ఏర్పడినప్పుడు హిందూ, ముస్లింల మధ్య గొడవలు జరగుతాయని అనుమానాలు వ్యాప్తి చేశారన్నారు. కానీ కేసీఆర్ పదేళ్ల హయంలో గంగా–జమున తహజీబ్ ను పాటించటంలో తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలిచేలా చేశారన్నారు. కేసీఆర్ మనిషిని, మనిషిగా మానవత్వంతో చూశారన్నారు. కానీ మత పరంగా, ఓట్ల పరంగా చూడలేదన్నారు. అన్ని మతాల వారికి మేలు చేసే విధంగా బతుకమ్మ చీరలు, రంజాన్ తోఫా, క్రిస్ మస్ కానుకలు ఇచ్చారన్నారు.

# కలెక్టర్‌పై మహిళా రైతు దాడి..?

- మరో అధికారిని ఉరికించిన గ్రామస్తులు..
- రసాభాసగా ఫార్మా కంపెనీ ప్రజాభిప్రాయ సేకరణ..
- బందోబస్తు వైఫల్యంతోనే ఘటన..?
- వికారాబాద్ జిల్లాలో ఉద్రిక్తత



**జనపదం, వికారాబాద్ సిటీ:** ఫార్మా కంపెనీ ఏర్పాటుకు ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం వికారాబాద్ జిల్లాలో తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. కలెక్టర్, అధికారుల వాహనాలపై గ్రామస్తులు, రైతులు రాళ్ల దాడికి పాల్పడ్డారు. వారి వాహనాలపై రాళ్లు, కర్రలతో దాడికి పాల్పడ్డారు. ఓ మహిళా రైతు కలెక్టర్ ప్రతీక్ జైన్‌పై చేయి చేసుకున్నట్లు తెలుస్తోంది. దుద్యాల మండలంలో ఈ ఘటన చోటు చేసుకుంది. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. ఫార్మా సంస్థ ఏర్పాటుకు సంబంధించి భూసేకరణ కోసం దుద్యాల మండలం లగచర్ల గ్రామానికి చెందిన రైతులతో ప్రభుత్వం సంప్రదింపులు జరుపుతోంది. ఫార్మా సంస్థ ఏర్పాటును అక్కడి రైతులు, గ్రామస్తులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. వారికి నచ్చచెప్పేందుకు అధికారులు యత్నిస్తున్నారు. ఇందులో భాగంగానే దుద్యాల శివారులో సోమవారం ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో పాల్గొనేందుకు వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, కొడంగల్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, అదనపు కలెక్టర్ లింగానాయక్, సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ వెళ్లారు. దుద్యాల శివారులో ప్రజాభిప్రాయ సేకరణకు ఏర్పాట్లు చేయగా గ్రామస్తులు, రైతులు మాత్రం అక్కడికి రాకుండా లగచర్లలోనే ఉండిపోయారు.

### రాళ్లు, కర్రలతో దాడి..

ఈ నేపథ్యంలో గ్రామానికి చెందిన సురేశ్ అనే వ్యక్తి బాధిత రైతుల తరఫున ప్రజాభిప్రాయ సేకరణ వేదిక వద్దకు వెళ్లి కలెక్టర్ ప్రతీక్‌జైన్‌తో మాట్లాడారు. రైతులంతా తమ ఊరిలోనే ఉన్నారని అక్కడే ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించాలని కోరారు. దీంతో కలెక్టర్, అధికారులు అంగీకరించి అక్కడికి బయల్దేరి వెళ్లారు. అధికారులు గ్రామానికి చేరుకోగానే రైతులు ఒక్కసారిగా వారి వాహనాలపై రాళ్లు, కర్రలతో దాడికి పాల్ప డ్డారు. ఘటనలో వాహనాల అద్దాలు ధ్వంసమయ్యాయి. కలెక్టర్, అధికారులు వాహనా లు దిగి రైతులకు నచ్చచెప్పేందుకు యత్నించినా వినలేదు. కలెక్టర్ డౌన్ డౌన్... నినాదాలతో గ్రామస్తులు మరింత రెచ్చిపోయారు. ఈ క్రమంలో ఓ మహిళా రైతు కలెక్టర్ ప్రతీక్‌జైన్‌పై చేయి చేసుకున్నట్లు తెలుస్తోంది. కడా ప్రత్యేకాధికారి వెంకట్ రెడ్డికి రాళ్లు తగలడంతో గాయాలయ్యాయి. దీంతో ఆయన పొలాల వెంబడి పరిగెత్తి అక్కడి నుంచి వెళ్లిపోయారు. గ్రామంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. కలెక్టర్, అధికారులు లగచర్లకు వెళ్లే సమయంలో ముందు జాగ్రత్తగా బందోబస్తు ఏర్పాట్లు చేయకపోవడంతోనే ఈ ఘటన జరిగినట్లు తెలుస్తోంది.

### నాపై దాడి చేయలేదు..

**వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్**

తనపై ఎవరు దాడి చేయలేదని వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ వివరణ ఇచ్చారు. జిల్లాలోని లగచర్ల గ్రామంలోని భూ సేకరణకు సంబంధించి గ్రామస్తులు పిలిచారని, వారితో చర్చలు జరిపామని అన్నారు. అదే సమయంలో అల్లరి మూకలు హడావుడి చేశారని కలెక్టర్ జైన్ తెలిపారు. ఘటనపై దర్యాప్తు జరుగుతోందని, ఎవరూ ఆందోళన చేయవద్దని కోరారు. పెన్ డౌన్ చేసిన ఉద్యోగులతో కూడా తాను మాట్లాడి పరిస్థితిని చక్కదిద్దినట్లు చెప్పారు.

## టీజీపీఎస్సీ చైర్మన్ నియామకానికి నోటిఫికేషన్

**చివరి తేదీ నవంబర్ 20**

**జనపదం, హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ నియామకానికి సోమవారం సాయంత్రం విడుదలైంది. నవంబర్ 20న సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తు చేసుకొనేందుకు అవకాశం కల్పించారు. అర్హులైన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. టీజీపీఎస్సీ ప్రస్తుత చైర్మన్ మహేందర్ రెడ్డి పదవీకాలం ఈ ఏడాది డిసెంబర్ 3వ తేదీతో ముగియనుంది. ఈ నేపథ్యంలో టీజీపీఎస్సీ నూతన చైర్మన్ కోసం ప్రభుత్వం కొత్తగా నోటిఫికేషన్ విడుదల చేసింది.

# టార్గెట్ హైదరాబాద్.. వైజాగ్

- తెలుగు రాష్ట్రాలకు ఉగ్రముప్పు
- హైదరాబాద్‌లో స్లీపర్ సెల్స్
- విస్తరిస్తున్న హిజ్బ్-ఉత్ -తహ్రీర్
- భద్రతా సంస్థలను అలెర్ట్ చేసిన ఎన్ఐఏ

**జనపదం, హైదరాబాద్ ప్రతినిధి :** ప్రశాంతంగా ఉన్నట్లు కనిపిస్తున్న తెలుగు రాష్ట్రాలకు జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) బాంబులాంటి హెచ్చరికలు పంపించింది. దేశంలో రోజురోజుకూ పెరుగుతున్న ఉగ్రవాద సంస్థ హిజ్బ్-ఉత్ -తహ్రీర్ (హెచ్‌యూటీ) నెట్‌వర్క్ తెలుగు రాష్ట్రాలకు వ్యాపించిందని, ఆ సంస్థ స్లీపర్ సెల్స్ ఇక్కడ మాటు వేశాయని ఎన్ఐఏ వెల్లడించింది. ఐసిస్ తర్వాత భారత్‌కు ఈ ఉగ్రవాద సంస్థ అతిపెద్ద ముప్పుగా మారుతోందని వెల్లడించింది. అయితే, ఇప్పటికే దేశంలో ముంబై మారణహోమం, హైదరాబాద్ గోకుల్ చాట్ పేలుళ్లతో ఉగ్రవాద రక్తపు మరకలను జాతీయ దర్యాప్తు సంస్థ గుర్తు చేసింది. గత దశాబ్దకాలంగా భారత ప్రభుత్వం ఉగ్రవాదంపై అనుసరిస్తున్న కఠిన వైఖరి కారణంగా ఈ తరహా విద్రోహ చర్యల్ని నిఘా సంస్థలు, భద్రతా బలగాలు ముందుగానే పసిగట్టి అడ్డుకుం టున్నాయి. అయినప్పటికీ.. కొన్నిచోట్ల చిన్నా, చితకా దాడులకు దిగుతూనే ఉన్నాయి. ఇటీవల హైదరాబాద్‌లో ఓ ఉగ్రవాదిని పట్టుకున్నారు. ఇప్పుడు తాజాగా హిజ్బ్ -ఉత్-తాహిర్ పేరుతో భారత్‌లో ఉగ్రవాద కార్యకలాపాలను చాపకింద నీరులా విస్తరిస్తున్నట్టు నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ గుర్తించింది. ఈ మేరకు దేశవ్యాప్తంగా పోలీస్, భద్రతా సంస్థలను అప్రమత్తం చేసింది.

**పలు రాష్ట్రాల్లో స్లీపర్ సెల్స్**

దేశంలో పెరుగుతున్న ఉగ్రవాద సంస్థ హిజ్బ్-ఉత్-తహ్రీర్ నెట్‌వర్క్‌పై జాతీయ దర్యాప్తు సంస్థ వివరాలను వెల్లడించింది. ఈ మేరకు రాష్ట్రాలకు హెచ్చరికలు పంపించింది. ఇస్లామిక్ స్టేట్ (ఐఎస్ఐఎస్) ఉగ్రవాద సంస్థ తర్వాత భారత్‌కు హెచ్‌యూటీ ఉగ్రవాద సంస్థ అతిపెద్ద ముప్పుగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేసింది. ఇటీవల జరిగిన రెండు రోజుల ఉగ్రవాద వ్యతిరేక సదస్సులోదక్షిణాది రాష్ట్రాల్లో ఉగ్రనీడలను వెల్లడించింది. దేశంలో ముఖ్యంగా దక్షిణాదిన ఉన్న తెలంగాణ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌తో పాటు మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో హిజ్బ్-ఉత్-తహ్రీర్ సంస్థకు స్లీపర్ సెల్స్ ఉన్నట్లు కేంద్ర ఏజెన్సీ అనుమానిస్తోంది. ఈ సంస్థ బంగ్లాదేశ్‌లోనూ చురుగ్గా కార్యాకలాపాలు సాగిస్తోంది. ఇటీవలనే కేంద్ర ప్రభుత్వం ఈ సంస్థను ఉగ్రవాద సంస్థగా ప్రకటించి నిషేధించింది. ఈ సంస్థ అనేక ఉగ్రవాద కార్యకలాపాలలో పాల్గొంటున్నదని, అమాయక యువతను ఉగ్రవాద సంస్థల్లో చేరేలా ప్రేరేపించడం, ఉగ్రవాద కార్యకలాపాలకు నిధులు సమీకరించడం వంటి కార్యాకలాపాలకు పాల్పడుతోందని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ సంస్థ జాతీయ భద్రతకు, దేశ సార్వభౌమత్వానికి తీవ్రమైన ముప్పుగా పేర్కొంది. జిహాద్, ఉగ్రవాద కార్యకలాపాల ద్వారా ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన ప్రభుత్వాలను కూలదోయడం ద్వారా భారతదేశంతో సహా ప్రపంచవ్యాప్తంగా ఇస్లామిక్ దేశాలను స్థాపించడమే హిజ్బ్-ఉత్-తాహిర్ ఉగ్రవాద సంస్థ లక్ష్యం అని కేంద్ర ప్రభుత్వం చెబుతోంది. ప్రజాస్వామ్య వ్యవస్థకు, దేశ అంతర్గత భద్రతకు తీవ్ర ముప్పుగా పరిణమిస్తోందని వెల్లడించింది. ఇందులో భారతీయ పౌరులను మతం పేరుతో ఆకట్టుకుంటూ మైండ్ వాష్ చేసి ఉగ్రవాదులుగా మార్చుతోంది. ఇందుకోసం సామాజిక మాధ్యమాలను విస్తృతంగా ఉపయోగించుకుంటోందని ఎన్ఐఏ దర్యాప్తులో తేలింది. ఈ సంస్థతో సంబంధం ఉన్న పలువురు అనుమానిత ఉగ్రవాదులను ఎన్ఐఏ అరెస్టు చేసింది. హిజ్బ్-ఉత్-తహ్రీర్ ప్రధాన కార్యాలయం లెబనాన్‌లో



ఉంది. భారతదేశాన్ని ఇస్లామిక్ దేశంగా మార్చడం కోసం పనిచేస్తోంది. తాజాగా ఈ సంస్థతో సంబంధం ఉన్న 17 మంది అనుమానిత ఉగ్రవాదులపై ఎన్ఐఏ ఛార్జ్ షీట్ కూడా దాఖలు చేసింది.

**హైదరాబాద్.. వైజాగ్**

తెలుగు రాష్ట్రాల్లో.. ప్రధానంగా తెలంగాణలో హైదరాబాద్, ఏపీలో వైజాగ్ ప్రాంతాలపై హెచ్‌యూటీ ఉగ్ర సంస్థ ముప్పు ఉందని పేర్కొన్నది. ఈ ప్రాంతాల్లో స్లీపర్ సెల్స్ మాటు వేశాయని హెచ్చరిస్తున్నది. ఇప్పటికే పోలీసు యంత్రాంగానికి కొన్ని ఫొటోలను సైతం పంపించింది. హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో ఈ ఉగ్రవాదులున్నట్లుగా అనుమానాలు వ్యక్తం చేసింది. అటు వైజాగ్‌ను కూడా హిజ్బ్-ఉత్-తహ్రీర్ సంస్థ టార్గెట్ చేసిందని వెల్లడించింది. దీంతో రాష్ట్రంలోనూ పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది.



## బీసీల గురించి మాట్లాడే అర్హత కేటీఆర్ కు లేదు..

- కుల గణనకు సహకరించాలి
- ప్రజల స్థితిగతులను తెలుసుకోవడానికే సర్వే..
- రాజకీయ పార్టీల రెచ్చగొట్టే వ్యాఖ్యలకు ప్రభావితం కావొద్దు
- బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

**జనపదం, రాజన్న సిరిసిల్ల :** బీసీల గురించి మాట్లాడే అర్హత కేటీఆర్ కు లేదని, పార్టీ అధ్యక్ష పదవి, కార్యనిర్వహక పదవి, ప్రతిపక్ష పదవి బీసీ,ఎస్సీలకు ఒక్కోటి ఇచ్చిన తరువాతే ఆయనకు అర్హత ఉంటుందని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కార్తీక సోమవారం సందర్భంగా వేములవాడలో శ్రీ రాజ రాజేశ్వర స్వామిని పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, మాజీ మంత్రి కనుమూరి బాపిరాజుతో కలిసి దర్శించుకున్నారు. గోపూజ నిర్వహించి కోడే మొక్కు చెల్లించుకొని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం విలేకరులతో పొన్నం మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే కి ప్రతి తెలంగాణ పౌరుడు సహకరించాలని అన్నారు. ఇది ,తెలంగాణ అభివృద్ధి ప్రణాళిక కోసం తీసుకుంటున్న సమాచారం అన్నారు. కేటీఆర్ కాంగ్రెస్ పార్టీ బీసీ లకు ఏం చేసిందని అంటున్నారని, గత స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు అన్యాయం చేసిన మీకు మాట్లాడే అర్హత లేదన్నారు. మీ పార్టీలో బీసీలకు ఎక్కడ న్యాయం ఉందని ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణలో జరుగుతున్న కుల సర్వే దేశ వ్యాప్తంగా జరగాలని డిమాండ్ వస్తోందన్నారు. కుల సర్వే ఇష్టం లేని బీజేపీ, తెలంగాణలో బీసీలకు అన్యాయం చేయాలని చూస్తున్న బీ ఆర్ ఎస్ కలిసి సర్వే పై అక్కడక్కడ అప్రతిష్ఠపాలు చేయాలని చూస్తున్నాయని ఆరోపించారు. జీవో 18 ద్వారా యావత్ తెలంగాణలో సమాచారం సేకరించి అసమానతలు తొలగించి అన్ని రకాలుగా న్యాయం చేయాలనే ఆలోచనతో ముందుకు పోతున్నామన్నారు. కుల గణన సర్వేకి ప్రజలు సహకరించాలని, బ్యాంకు డిటైల్స్ అడగడం లేదని, ఆప్షనల్ గా ఆధార్ అడుగుతున్నారని, ప్రజల స్థితిగతులు తెలవడానికి ప్రభుత్వం సమాచారం సేకరిస్తుందన్నారు. ఇందులో ఎలాంటి అనుమానాలు అవసరం లేదని, ఎన్యుమరేటెర్స్ కి సమాచారం ఇవ్వాలని కోరారు. రాజకీయ పార్టీల రెచ్చగొట్టే వ్యాఖ్యలకు ప్రజలు ప్రభావితం కావొద్దని, తెలంగాణ లో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన, మీ ఆకాంక్షలకు అనుగుణంగా వచ్చిందదని, భవిష్యత్ ప్రణాళికలతో ముందుకు పోతున్నామని అన్నారు.




## దేశంలో రెండే పరివార్లు..

- ఒకటి మోడీ.. ఇంకోటి గాంధీ ..
- ప్రజల మధ్య వైషమ్యాలు రెచ్చగొట్టేందుకు మోడీ పరివార్..
- దేశ సమైక్యతకు గాంధీ పరివార్
- మెరుగైన విద్య కోసమే మౌలానా అబుల్‌కలాం ఎడ్యుకేషన్ పాలసీ
- మైనార్టీ దినోత్సవ వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి

**జనపదం, ప్రతినిధి :** దేశంలో ఉన్నవి రెండే పరివార్లు అని.. .అందులో ఒకటి మోడీ పరివార్ అయితే రెండోది గాంధీ పరివార్ అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఇందులో ప్రజల మధ్య వైషమ్యాలు రెచ్చగొట్టేందుకు మోడీ పరివార్ పనిచేస్తుండగా., దేశ సమైక్యతకు గాంధీ పరివార్ కృషి చేస్తోందని అన్నారు. మోడీకి రాజకీయ ప్రయోజనాలే మిన్న అని ధ్వజమెత్తారు. ఓట్లు, సీట్ల కోసమే ఆయన తపన అని మండిపడ్డారు. సోమవారం రవీంద్రభారతిలో జాతీయ విద్యా దినోత్సవం, మైనార్టీ సంక్షేమ దినోత్సవ వేడుకలు జరిగాయి.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఎం రేవంత్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావడంలో మైనారిటీలు కీలక పాత్ర పోషించారన్నారు, హిందూ, ముస్లింలు తెలంగాణ ప్రభుత్వానికి రెండు కళ్లలాంటి వారన్నారు. మీరంతా అండగా ఉంటే విద్య, వైద్యం, ఉపాధి విషయంలో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపించుకుందామని అన్నారు. దేశ ప్రజలకు మెరుగైన విద్య అందించేందుకు కేంద్రంలోని నాటి కాంగ్రెస్ సర్కార్.. మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఎడ్యుకేషన్ పాలసీని తీసుకొచ్చిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ముస్లింలను కాంగ్రెస్ ఏనాడు ఓటర్లుగా చూడటంలేదన్నారు. వారిని సోదరులుగా, కుటుంబ సభ్యులుగా పరిగణించామన్నారు. కానీ దురదృష్టవశాత్తు అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్క మైనారిటీని కూడా ఎమ్మెల్యేగా గెలిపించుకోలేకపోయామన్నారు. అందుకే మైనారిటీ మంత్రి ఇచ్చే అవకాశం లేకుండా పోయిందన్నారు. కానీ షబ్బీర్ అలీని ప్రభుత్వ సలహాదారులుగా చేసామని, అమీర్ అలీ ఖాన్‌కు ఎమ్మెల్సీ ఇచ్చామని, కార్పొరేషన్ పదవులు ఇచ్చామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి తరువాత ఇప్పటి వరకు సీఎంవోలో మైనారిటీ అధికారిని నియమించలేదన్నారు. కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో సీఎంవోలో ఒక మైనారిటీ అధికారిని నియమించామని సీఎం పేర్కొన్నారు. దేశంలో మైనారిటీలకు ముఖ్యమంత్రులుగా, మంత్రులుగా కాంగ్రెస్ పార్టీ అవకాశం ఇచ్చిందన్నారు. అందువల్ల మైనార్టీలో మోడీ పరివార్‌తో ఉండాలో.. గాంధీ పరివార్‌తో ఉండాలో మీరే నిర్ణయించుకోవాలన్నారు. మహారాష్ట్రలో కాంగ్రెస్ అధికారంలోకి తీసుకొచ్చేందుకు మైనారిటీలు కృషి చేయాలని పిలుపిచ్చారు. దేశంలో కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని, మహారాష్ట్రలో మహావికాస్ అగాడి కూటమిని అధికారంలోకి తీసుకొచ్చేందుకు కృషి చేయాలన్నారు. దేశంలో మోదీని ఓడించి రాహుల్ గాంధీని ప్రధానిగా చూసే వరకు విశ్రమించొద్దని సీఎం రేవంత్ రెడ్డి పిలుపిచ్చారు.

## అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు

- నూతన భవనాల నిర్మాణానికి ప్రతిపాదనలు అందివ్వాలి
- భూపాలపల్లిని రోల్ మోడల్ గా నిలపాలి
- కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్
- విద్యా, వైద్య, సంక్షేమ, వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్ష



**జనపదం, భూపాలపల్లి :** అంగన్వాడీ కేంద్రాల్లో మౌ లిక సదుపాయాలు కల్పనకు, నూతన భవనాలు నిర్మాణానికి ప్రతిపాదనలు అందజేయాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ తెలిపారు. భూపాలపల్లి జిల్లా అభివృద్ధిలో అగ్రగామిగా నిలిచి దేశానికి రోల్ మో డల్ గా ఉండాలని, పారామీటర్స్ పై అధికారులు క్షేత్రస్థాయిలో సమీక్ష సమావేశాలు నిర్వహిస్తూ అభివృద్ధిని పరుగులు పెట్టించాలని ఆయన పేర్కొన్నారు. అన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పనకు నూతన భవనాలు నిర్మాణానికి ప్రతిపాదనలు అందజేయాలని తెలిపారు. సోమవారం స్థానిక ఐడీఓసీ కార్యాలయంలో యాస్పిరేషన్ లక్ష్యాల సాధనపై విద్యా, వైద్య, సంక్షేమ,వ్యవసాయ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షలో కేంద్ర మంత్రి పాల్గొన్నారు. సంపూర్ణతా అభియాన్ ఉద్దేశాలను, ఆ స్పిరేషనల్ బ్లాక్ లుగా గుర్తించిన మహాముత్తారం, పలిమెల మండలాల్లో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై ఆరా తీశారు. మహాముత్తారం మండలం, ఎంపిడిఓ కార్యాలయంలో యాస్పిరేషన్ పారా మీటర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా బం డి మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ప్రజలకు ఏం కావాలో అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని, అందుకు సంబంధిత నివేదికలను తనకు అందజేస్తే కేంద్రం ద్వారా నిధుల మం జూరుకు కృషి చేస్తానని తెలిపారు. గర్భ నిర్ధారణ జరిగిన నాటి నుంచే ఆ రోగ్య పరీక్షలు నిర్వహిస్తూ రిజిస్ట్రేషన్ చేయాలన్నారు. ఆరోగ్యవంతమైన బిడ్డ జన్మిస్తేనే ఆరోగ్యవంతమైన స మాజం ఏర్పడుతుందన్నారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతల వివరాలను నమోదు చేస్తూ ఎప్పటికప్పుడు ఆరోగ్య పరిరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాలో యాస్పిరేషన్ పారామీటర్లు 95 శాతంపైగా నమోదు చేస్తున్నారని అభినందిస్తూ, క్షేత్రస్థాయిలో ఎ లాంటి చర్యలు చేపట్టాలో అధికారులు సూచనలు చే యాలని అన్నారు. చిన్నారులకు చిరుధాన్యాలతో కూడిన ఆహారాన్ని అందించేందుకు గణపురం మండలం చెల్పూర్ లో మిల్లెట్ కేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు.

**డిమాండ్ ఉన్న పంటలు సాగుచేయాలి**

భూసార పరీక్షలు నిర్వహిస్తూ భూమిని బట్టి పంటలు సాగు చేపట్టేందుకు పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, సంప్రదాయ పంటల సాగుకు స్వస్తి చెప్పి మార్కెట్ లో డిమాండ్ ఉన్న పంటలను సాగుచేయాలని బండి సంజయ్ సూచించారు. సంబంధిత డిమాండ్ ఉన్న పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని, పంట మార్పిడి విధానం ద్వారా మాత్రమే అధిక దిగుబడి వస్తుందని తెలిపారు. గిరి వికాసం క్రింద 186 సర్వీసులు మంజూరు చేశామని, అలాగే మరో 136 సర్వీసులు మంజూరు చే యాల్సి ఉందని, తక్షణ మంజూరుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైతు సంఘాలు ఏర్పాటు ద్వారా రైతులను గ్రూపులుగా ఏర్పాటు చేసి పంట సాగుపై రైతులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. అన్ని పాఠశాలల్లో మరుగుదొడ్లు, మంచినీరు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలు ఉండే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. పారామీటర్ల లక్ష్య సాధనలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ను కేంద్ర మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ ఇండికేటర్లు నూరు శాతం సాధించేందుకు చర్యలు తీసుకుంటామని, 30 ఏళ్లు పైబడిన వాళ్లందరికీ మధుమేహ, బీపీ పరీక్షలు నిర్వహిస్తూ ఆరోగ్య పరిరక్షణ చర్యలు చేపడతూ వారిని ఫాలోఅప్ చేస్తూ వైద్య సేవలు అందిస్తున్నామని, అబా కార్డులు జనరేట్ చేస్తూ నిరంతర పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి , జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## గుంతలు లేని రోడ్ల కోసం వ్యూహాత్మక ప్రణాళిక

- రోడ్ల మరమ్మతుల కోసం తీవ్రంగా శ్రమిస్తున్నాం
- రానున్న రోజుల్లో 9 వేల కిలో మీటర్ల మేర రోడ్లపై గుంతలు పూడుస్తాం
- మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి

**జనపదం, రంగారెడ్డి :** రాష్ట్రంలో రోడ్లపై గుంతలను పూడ్చేందుకు అధునాతన పద్ధతులు, మెషినరీని ఉపయోగించి వేగంగా గుంతలను పూడ్చేందుకు ప్రణాళికలను సిద్ధం చేశామని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట రెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం రంగారెడ్డి జిల్లా మెయినాబాద్ మండలం చిలుకూర్ గ్రామం వద్ద రహదారులపై గుంతలను పూడ్చేందుకు సిద్ధం చేసిన "ఎయిర్ ప్రెషర్ జెట్ ప్యాచర్", "పాట్ హోల్ అండ్ రోడ్ మెయింటెనెన్స్ మిషనరీ" పనితీరును ఆర్ అండ్ బీ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ వికాస్ రాజ్, స్పెషల్ సెక్రెటరీ దాసరి హరిచందనతో కలిసి మంత్రి కోమటిరెడ్డి పరిశీలించారు. అనంతరం మీడియాతో మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ.. రోడ్లపై గుంతలను సంప్రదాయ పద్ధతుల్లో నింపడం వల్ల నె ల సమయం పడుతుందని ఈ లోపు రహదారులపై మరోచోట గుంత లు పడుతున్నాయని చెప్పారు. ఈ నే పథ్యంలో మెకనైజ్డ్ రోడ్ రిపేరింగ్ విధానంలో గుంతలను పూడిస్తే.. తక్కువ సమయంలో ప్రజలకు మెరుగైన రవాణా వ్యవస్థను అందించవచ్చని ఆయన తెలిపారు. అంతేకాకుండా 90శాతం కార్బన్ ఎమిషన్స్ ను తగ్గించగలిగే ఎకోఫ్రెండ్లీ పద్ధతుల వల్ల పర్యావరణానికి హాని తక్కువగా ఉండటంతో పాటు రద్దీగా ఉండే రహదారులపై పనులు వేగంగా చేయడం వల్ల ప్రమాదాలు తగ్గుతాయని అన్నారు. ఖచ్చితత్వంతో ప్యాచ్ వేయగలిగే మెకనైజ్డ్ సిస్టం వల్ల ప్యాచ్ వేసినట్టు కనిపించకుండా సహజంగా రోడ్డు వేసినట్టే ఉంటుందని, దాని వల్ల వాహనాలు కుదుపులకు గురికాకుండా పూర్తిగా రోడ్డంత ఒకేసారి వేసినట్టు ఉంటుందని ఆయన తెలిపారు. వీటితో పాటు తక్కువ ఖర్చుతో ఎక్కువ రోడ్లను తక్కువ సమయంలో రిపేర్లు చేయడం వల్ల ప్రభుత్వానికి ఆర్థిక భారం తగ్గడంతోపాటు ప్రజలకు గుంతలు లేని రోడ్లు అందుబాటులోకి వస్తాయని ఆయన వెల్లడించారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన నిర్లక్ష్యం ఇప్పటికి ప్రభుత్వానికి గుదిబండగా మారిందని మంత్రి కోమటిరెడ్డి విమర్శించారు. రాష్ట్రంలో ఏ ఊరికి పోయిన రహదారులు తీవ్రంగా దెబ్బతిన్నాయని, 7 లక్షల కోట్ల అప్పులు చేసి దోచుకొని తెలంగాణ ప్రజలపై భారం మోపిన కేసిఆర్ కనీసం రోడ్లపై గుంతలుకూడా పూడ్చలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల మెరుగైన జీవన ప్రమాణాలు అందించడంలో రోడ్లు కీలకపాత్ర పోషిస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర్ రెడ్డి స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్యతో పాటు ఆర్ అండ్ బి ఉన్నతాధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.





## బంగారు పతకం సాధన లక్ష్యంగా చర్యలు

- రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి
- సాంఘిక సంక్షేమ గురుకులాల క్రీడా పోటీలు ప్రారంభం

**జనపదం, ఖమ్మం:** రాబోయే ఒలంపిక్స్ లో తెలంగాణ నుంచి బంగారు పతకాలు సాధించే క్రీడాకారులను తయారు చేయడం లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌరసంబంధాల, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. సోమవారం మంత్రి, జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ లతో కలిసి ఖమ్మం జిల్లా వైరా పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆవరణలో నిర్వహించిన పదవ జోనల్ స్థాయి విద్యార్థినుల క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మూడు రోజుల పాటు జరిగే పదవ జోనల్ స్థాయి విద్యార్థినుల క్రీడా పోటీలు నేడు ప్రారంభమయ్యాయని, ఖమ్మం ఉమ్మడి జిల్లా పరిధిలోని 14 సాంఘిక సంక్షేమ గురుకులాల్లోని సుమారు 1190 మంది పిల్లలతో వైరా పాఠశాలలో క్రీడా పోటీలు జరుగుతున్నాయని మంత్రి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 20 చోట్ల ఇటువంటి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు ప్రభుత్వ పని తీరు ఎలా ఉందో గమనిస్తున్నారని మంత్రి అన్నారు. ప్రజా ప్రభుత్వం వచ్చి 11 నెలలు అవుతుందని, విద్యా, వైద్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించిందన్నారు. ఇందిరమ్మ రాజ్యం రాగానే ఆర్థిక వ్యవస్థ బాగు చేస్తూ ఉద్యోగస్తులకు ఒకటో తేదీ జీతాలు అందించామని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పిల్లలు నిరుత్సాహానికి గురి కాకుండా కార్పొరేట్ కు దీటుగా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 150 కోట్లు ఖర్చు చేస్తూ యంగ్ ఇండియా సమీకృత విద్యాలయాలు నిర్మిస్తున్నామని మంత్రి తెలిపారు. నవంబర్ 14న మరో 60 స్కూళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నామని మంత్రి అన్నారు. రాబోయే ఒలింపిక్స్ లో మన భారతదేశానికి తెలంగాణ రాష్ట్రం నుంచి బంగారు పతకాలు సాధించే విధంగా క్రీడలను ప్రోత్సహించాలని, చదువు ఒకటే కాకుండా క్రీడలలో కూడా విద్యార్థులకు శిక్షణ అందించాలని, చదువుకున్న విద్యార్థులకు అవసరమైన నైపుణ్యాలను అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల జోనల్ అధికారిణి స్వరూపారాణి, డి.సి.ఓ. రాజ్యలక్ష్మి , వైరా సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల ప్రిన్సిపల్ డాక్టర్ డి. సమత, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, వివిధ గురుకులాల విద్యాలయాల ప్రిన్సిపాల్ లు, జోనల్ గేమ్స్ రూరల్ ఓవరాల్ ఇంచార్జ్ కె. శ్రీలత, వ్యాయామ ఉపాధ్యాయులు, ఫిజికల్ డైరెక్టర్లు, టీచర్స్, గురుకులాల సిబ్బంది పాల్గొన్నారు.

## బీజేపీకి లబ్ధి చేసేందుకు బీఆర్ఎస్ కుట్ర

- కమలానికి బీ టీమ్ లా పనిచేస్తున్న కారు..
- మహిళల ఉచిత ప్రయాణంలో విష ప్రచారం
- పంట రుణాల మాఫీ చేయని బీఆర్ఎస్
- రైతులపై ప్రేమ చూపిస్తున్నట్లు నటిస్తోన్న బీఆర్ఎస్ నేతలు
- మంత్రి సీతక్క ఫైర్

**జనపదం, సెక్రటేరియట్ :** తొమ్మిదేళ్ల పాలనలో తెలంగాణను అప్పుల పాలు చేసిన బీఆర్ఎస్ మహారాష్ట్ర ఎన్నికల్లో బీజేపీకి లబ్ధి చేసేందుకు ప్రయత్నిస్తోందని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క ధ్వజమెత్తారు. తెలంగాణలో అధికార కాంగ్రెస్ పార్టీ అమలు చేసిన సంక్షేమాన్ని కక్షపూరితంగా బీఆర్ఎస్ నేతలు విమర్శిస్తున్నారని ఆమె మండిపడ్డారు. మహారాష్ట్రలో బీజేపీకి బీఆర్ఎస్ బీటీమ్ మాదిరిగా పనిచేస్తుందని అన్నారు. ఈ మేరకు సోమవారం సచివాలయంలో మీడియాతో మంత్రి సీతక్క మాట్లాడారు. రాష్ట్రాన్ని రెండుసార్లు పరిపాలించిన బీఆర్ఎస్ ఎన్నో తప్పుడు పనులకు పాల్పడిందని ఆమె ఆరోపించారు. కేసుల నుంచి తప్పించుకునేందుకు బీజేపీతో బీఆర్ఎస్ అంటకాగుతోందని ఆమె విమర్శించారు. మహారాష్ట్ర లో అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ వచ్చిన నాటి నుంచి పక్కా ప్రణాళికతో తమ ప్రజా ప్రభుత్వంపై బీఆర్ఎస్ విష ప్రచారం చేస్తుందని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళల ఉచిత ప్రయాణ పథకంపై దుష్ప్రచారం చేస్తున్నారని, ఆటో డ్రైవర్లను ఉసిగొల్పి ధర్నాలు చేయిస్తున్నారని ఆమె ఆరోపించారు. బీఆర్ఎస్ హాయంలో ఓలా, ఉబర్ క్యాబ్ లు, బైకులు తెచ్చినప్పుడు ఆటో డ్రైవర్లు గుర్తుకు రాలేదా అని ఆమె ప్రశ్నించారు. రుణమాఫీ చేస్తామని ప్రకటించి, ప్రజల్ని మోసం చేసిన బీఆర్ఎస్ పార్టీ..



ఇప్పుడు రైతులపై లేని ప్రేమ కురిపిస్తుండడం విడ్డూరంగా ఉందని అన్నారు. కేసీఆర్ హయాంలో 20 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేయలేదని, వారు విడుదల చేసిన డబ్బులు.. రైతులకు బ్యాంకు వడ్డీలు చెల్లించేందుకు సైతం సరిపోలేదని అన్నారు.

## కర్ణాటకను కుదిపేస్తున్న 'రంగు'

- కుమారస్వామిపై మంత్రి అభ్యంతరకర వ్యాఖ్యలు
- తీవ్రంగా ఖండించిన జేడీఎస్, బీజేపీ

**జనపదం, బెంగళూరు:** కేంద్రమంత్రి, జేడీఎస్ నాయకుడు హెచ్‌డీ కుమారస్వామిపై కర్ణాటక మంత్రి జమీర్ అహ్మద్ చేసిన అభ్యంతరకర వ్యాఖ్యలు రాజకీయ వివాదానికి దారితీశాయి. జమీర్ అహ్మద్- కాలీయ (నలుపు రంగు) కుమారస్వామి బీజేపీ కన్నా ప్రమాదకరమని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలతో కర్ణాటక రాజకీయాల్లో ప్రకంపనలు రేగాయి. జమీర్ చేసిన జాత్యంహకార వ్యాఖ్యలను జేడీఎస్, బీజేపీ తీవ్రంగా ఖండించాయి. ఆయనను వెంటనే మంత్రివర్గం నుంచి తొలగించాలని కాంగ్రెస్ ను డిమాండ్ చేశాయి.

### 'రంగు' వివాదం

ఇటీవల సీపీ యోగీశ్వర అనే కాంగ్రెస్ నేత బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. కానీ తిరిగి ఆయన కాంగ్రెస్ గూటికే చేరారు. ఈ అంశంపై మాట్లాడిన జమీర్, "మా పార్టీలో ఉన్న అభిప్రాయ భేదాల వల్ల యోగీశ్వర స్వతంత్రంగా పోటీలో నిలబడ్డారు. కానీ తరువాత వేరేదారిలేక బీజేపీలో చేరారు. కానీ అక్కడ ఇమడలేక తిరిగి సొంతగూటికి చేరారు. అయితే 'కాలీయ (నలుపు రంగు) కుమార స్వామి బీజేపీ కన్నా ప్రమాదకారి. అందుకే యోగీశ్వర జేడీఎస్ పార్టీలోకి వెళ్లలేదు" అని వ్యాఖ్యానించారు. 'రంగు' గురించి జమీర్ మాట్లాడడంపై జేడీఎస్ తీవ్రంగా స్పందించింది. జమీర్‌ను మంత్రి పదవి నుంచి తొలగించాలని కాంగ్రెస్ పార్టీని డిమాండ్ చేసింది. 'కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, హెచ్‌సీ మహదేవప్ప, ప్రియాంక్ ఖర్గే ఏ రంగులో ఉన్నారో చెప్పాలని నిలదీసింది'.

### 'నన్ను పొట్టోడా అని అంటారు'

తాజా వివాదంపై జమీర్ స్పందించారు. తనకు హెచ్‌డీ దేవేగౌడ రాజకీయ గురువు అని పేర్కొన్నారు. ఆయన తనయుడైన కుమారస్వామిపై తనకు ఎలాంటి ద్వేషం లేదని, ఆయన అంటే తనకు ఎంతో అభిమానం ఉందని అన్నారు. "కుమారస్వామి నన్ను 'కుల్లా' (పొట్టోడు, మరుగుజ్జు) అని అంటారు. నేను ఆయనను కర్రియన్న (నల్ల సోదరుడు) అని అంటాను. మాది ఎప్పటి నుంచో ఉ న్న స్నేహం. మేము పరస్పరం చాలా కాలంగా ఇలానే అనుకుంటూ ఉన్నాం. ఇందులో తప్పేముంది" అని పేర్కొన్నారు. కర్ణాటకలోని చన్నపట్న ఉపఎన్నికల్లో జేడీఎస్ నేత కుమారస్వామి తనయుడైన నిఖిల్ పోటీ చేస్తున్నారు. ఆయన బీజేపీ-జేడీఎస్ కూటమి తరఫున పోటీ చేస్తుండగా, ఆయనకు ప్రత్యర్థిగా కాంగ్రెస్ పార్టీ నుంచి యోగీ శ్వర పోటీలో ఉన్నారు. జమీర్ అభ్యంతరకర వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి కిరణ్ రిజుజు మండిపడ్డారు.



# టికెట్ ధరల పెంపు లేదు

**నిర్మాతలకు సమయం ఇచ్చేది లేదు**

**మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి**

**జనపదం, సినిమా:** సినిమా టికెట్ ధరలు పెంచేది లేదని రాష్ట్ర సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్ ప్రసాద్ ప్రివ్యూ థియేటర్‌లో జరిగిన తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన కోమటిరెడ్డి మాట్లాడారు. టికెట్ ధరలు పెంచుకుంటామంటే కుదరదని, పాన్ ఇండియా పేరుతో సినిమాలు నిర్మించామని, టికెట్ ధరలు పెంచుకునేందుకు వెసులుబాటు కల్పించాలని కోరే నిర్మాతలకు ఇకపై సమయం ఇచ్చేది లేదని కోమటిరెడ్డి స్పష్టం చేశారు. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల్లో సినిమా పట్ల ఆసక్తి ఉన్న అందరిదని వ్యాఖ్యానించారు.

**తెలంగాణ వారికే ప్రాధాన్యత**

రాష్ట్రంలో చిత్ర పరిశ్రమను బాగా అభివృద్ధి చేయాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని పేర్కొన్నారు. తెలంగాణ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్‌కు ఆరోసారి ఛైర్మన్‌గా ఎన్నికైన రామకృష్ణ గౌడ్‌కి అభినందనలు తెలిపారు. ఈ అసోసియేషన్ ద్వారా ఆయన ఎంతో మందికి సహాయ సహకారాలు అందిస్తున్నారని అన్నారు. అయితే ఒకే కుటుంబం నుంచి ఐదారుగురు హీరోలు ఎదుగుతున్నారని, నిజమైన తెలంగాణ ప్రతిభ కలిగిన నటీనటులకు గుర్తింపు దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే సినీ కార్మికుల కోసం నిర్మించిన చిత్రపురి కాలనీలో చాలా మంది బయటి వ్యక్తులున్నారని, కొత్తగా నిర్మించే ఫ్లాట్లకు రిజిస్ట్రేషన్లు ఆపామని, వాటన్నింటిని తెలంగాణ నటీనటులకే ఇచ్చేలా కృషి చేస్తామని కోమటిరెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ నుంచి మా భూమి, బలగం వరకు ఎన్నో గొప్ప చిత్రాలు వచ్చాయని, ఎంతో మంది ప్రతిభ కలిగిన దర్శక నిర్మాతలున్నారని తెలిపిన మంత్రి, తప్పకుండా తమ ప్రభుత్వం తరపున అన్నివిధాల సహకారాన్ని అందిస్తామని వెల్లడించారు.



# పంద్రాగస్టు నాటికి ఎత్తిపోతల పథకం పూర్తి

**వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు**

**జనపదం, ఖమ్మం:** జిల్లాలో సాగునీటి వసతి లేని రఘునాథపాలెం మండలానికి రాబోయే పంద్రాగస్టు నాటికి మంచుకొండ ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీటి సరఫరాకు కృషి చేస్తున్నామని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస మంత్రి అల్లిపురం ధంసలాపురం మధ్యలో ఉన్న ఖమ్మం ఔటర్ రింగ్ రోడ్డు ప్రదేశంలో ఖమ్మం జిల్లాలో నూతన రోడ్ల నిర్మాణ అంశంపై మీడియా సమావేశం నిర్వహించారు. ఖమ్మం దేవరపల్లి జాతీయ రోడ్ల వివరాలను నేషనల్ హైవే సంస్థ మేనేజర్ దివ్య తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ గతంలో తాను మంత్రిగా పని చేసిన సమయంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలోని దాదాపు 45 మండలాలకు సాగునీటి సరఫరా కార్యక్రమాలు చేపట్టామని మంత్రి గుర్తు చేశారు. ఖమ్మం నియోజకవర్గంలోని రఘునాథపల్లి మండలంలో సాగునీటి వసతి లేదని, ఎత్తైన ప్రాంతంలో ఉన్నందున సాగర్ నుంచి 66.33 కోట్లతో మంచుకొండ ఎత్తిపోతల పథకం మంజూరు చేశామని, వి.వెంకటాయపాలెం గ్రామం దగ్గర 13 కిలోమీటర్ల వద్ద పంపు ఏర్పాటు చేసి మంచుకొండ ఎత్తిపోతల ద్వారా రఘునాథపాలెం మండలంలోని 30 చెరువులకు సాగర్ నీటి సరఫరా చేస్తామన్నారు. నాగపూర్ అమరావతి జాతీయ రహదారి ఎన్ హెచ్– 163జీ లో భాగంగా ఖమ్మం నుంచి విజయవాడ వరకు 2154 కోట్లతో 90 కిలోమీటర్లు, వరంగల్ నుండి ఖమ్మం 2300 కోట్లతో 108 కిలోమీటర్ల జాతీయ రహదారి పనులు ఇటీవల ప్రారంభమయ్యాయని, ఉగాది నాటికి పూర్తి చేస్తామన్నారు. ఖమ్మం నుంచి కురవి రోడ్, కురవి నుంచి అమరావతి రోడ్డు కనెక్టివిటి వస్తే ఖమ్మం పట్టణానికి రింగ్ రోడ్డు పూర్తవుతుందని, అమరావతి రోడ్డుకు సర్వీస్ రోడ్లు వేసే ప్రతిపాదనలు తయారు చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర్ రావు, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# విద్యతో పాటు క్రీడలు అవసరం



**రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం**

**జనపదం, బాన్సువాడ:** విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో చురుకుగా పాల్గొనాలని , బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. సోమవారం బాన్సువాడ గ్రామీణ మండలం బోర్లం గ్రామంలోని పాఠశాలలను ఆయన సందర్శించారు. జోనల్ స్పోర్ట్స్ మీట్ లో జాతీయ విద్యా దినోత్సవం 2024 సంధర్భంగా మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జన్మదిన వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని, మంచి స్ఫూర్తితో ఆడాలని అన్నారు. దేశంలో విద్యాభివృద్ధికి మౌలానా ఆజాద్ చేసిన సేవలు అమోఘమని అన్నారు. బోర్లం ఎస్సీ బాలికల గురుకుల పాఠశాలలో 10వ జోనల్ లెవెల్ స్పోర్ట్స్ మీట్ లో పాల్గొన్న క్రీడాకారులను అభినందించారు. అనంతరం బోర్లం మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్లో జాతీయ విద్యా దినోత్సవం 2024 సందర్భంగా మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జన్మదిన వేడుకలలో పాల్గొన్నారు. కార్యక్రమాలలో బాన్సువాడ పట్టణ, మండల నాయకులు, ప్రజాప్రతినిధులు, పాఠశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఇప్పుడు నేతల వంతు...

**ట్యాపింగ్ లో కేసులో కీలక పరిణామం...**
**మాజీ ఎమ్మెల్యే లింగయ్యకు నోటీసులు..**
**జూబ్లీహిల్స్ పీఎస్‌కు రావాలని ఆదేశం**
**అనారోగ్యంతో రాలేనని రిప్లై**
**14న హాజరవుతానని సమాచారం**
**ఫోన్ ట్యాపింగ్ లో మరో సంచలనం..**






**జనపదం, హైదరాబాద్ సిటీ:** ఫోన్ ట్యాపింగ్ కేసులో సంచలన పరిణామం చోటు చేసుకుంది. తొలిసారిగా రాజకీయ నేతకు నోటీసు జారీ అయింది. ఈ కేసులో ఇప్పటికే కేసీఆర్, కేటీఆర్‌పై ఆరోపణలు రాగా తాజాగా మాజీ ఎమ్మెల్యేకు నోటీసులు అందాయి. ఈ కేసులో ఇప్పటి వరకు అధికారులే జైలుకు వెళ్లగా ఇప్పుడు నేతల వంతు వచ్చింది. తాజాగా నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యకు ఈ కేసులో సమన్లు జారీ చేశారు. సోమవారం జూబ్లీహిల్స్‌లోని పోలీస్ స్టేషన్‌కు రావాలంటూ పోలీసులు నోటీసులు ఇచ్చారు. మాజీ ఎమ్మెల్యేకు నోటీసులు జారీ అవడంతో రాజకీయవర్గాల్లో సంచలనం రేకెత్తుతోంది. మొదటిసారిగా నాయకుడికి నోటీసులు జారీ కావడంతో ఉత్కంఠ నెలకొంది.

ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ప్రమేయం ఉన్నట్లు విచారణలో పోలీసులు గుర్తించారు. తన ప్రత్యర్థుల ఫోన్లు ట్యాప్ చేసి నిఘా ఉంచినట్లు నిర్ధారించారు. ఈ నేపథ్యంలోనే ఆయనకు నోటీసులు జారీ చేశారు. నిందితులతో ఆయనకు సన్నిహిత సంబంధాలున్నాయని పోలీసులు భావిస్తున్నారు.

**14న వస్తా..**

ఈ కేసులో ఆయన సోమవారం విచారణకు రావాలని నోటీసుల్లో పేర్కొన్నారు. కానీ, అనారోగ్యం కారణంగా తాను రాలేనని పోలీసులకు రిప్లై ఇచ్చారు. ఈ నెల 14న విచారణకు వస్తానంటూ సమాధానం పంపించారు.

**మారుతున్న రాజకీయం..**

ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం చాలా సీరియస్‌గా తీసుకుంది. కేసులో ఇప్పటికే పోలీసు ఉన్నతాధికారులు అరెస్ట్ అవగా రాజకీయ నాయకులు కూడా అరెస్ట్ అవుతారంటూ కాంగ్రెస్ నేతలు ప్రకటిస్తూ వస్తున్నారు. ఇలాంటి తరుణంలో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తికి నోటీసులు జారీ చేయడంపై ఉత్కంఠగా మారింది. ఇప్పటి వరకు అధికారులు.. ఇక నుంచి రాజకీయ నేతల వరుస వచ్చిందనే టాక్ నడుస్తోంది. నెక్ట్స్ ఎవరికి నోటీసులు జారీ చేస్తారు? ఎవరెవరికి ఈ కేసులో ప్రమేయం ఉందోననే ఆసక్తి నెలకొంది. మంత్రి పొంగులేటి అన్నట్లు పొలిటికల్ బాంబులు ఈ కేసులోనే పేలనున్నాయా? మరేదైనా కేసులు ఉన్నాయా? అనే చర్చ నడుస్తోంది. ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితులుగా ఏ1 ప్రభాకర రావు, రిటైర్డ్ ఐపీఎస్, ప్రణీత్ రావు డీఎస్పీ, ఏ3 రాధాకిషన్ రావు, రిటైర్డ్ అదనపు ఎస్పీ, ఏ4 భుజంగ రావు, అదనపు ఎస్పీ, ఏ5 తిరుపతన్న, అదనపు ఎస్పీ, రిటైర్డ్ అదనపు ఎస్పీ వేణుగోపాల్ రావు, గట్టుమల్లు భూపతి అరెస్ట్ అయ్యారు. ప్రభాకర రావు ఒక్కరే విదేశాల్లో ఉన్నారు. వీరంతా కలిసి ప్రతిపక్ష నాయకులు, అధికార పక్ష నాయకులు, సినిమా, వ్యాపార ప్రముఖుల ఫోన్లను ట్యాప్ చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రణీత్ రావు అరెస్ట్ తో ఈ వ్యవహారం మొత్తం బయటపడింది. కేసును సీరియస్‌గా తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక బృందంతో విచారణ జరిపించింది. విచారించే కొద్ది కొత్త కోణాలు వెలుగు చూస్తున్నాయి. పోలీసులు నాయకుల ప్రమేయం ఉందని నిర్ధారించారు. రేపో మాపో పొలిటికల్ లీడర్స్‌కి కూడా నోటీసులు అందజేస్తారనే ప్రచారం జరిగింది. దానికి కొనసాగింపుగానే సోమవారం మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యకు నోటీసులు జారీ చేశారు.




# లైన్ క్లియర్..

**(మొదటిపేజీ తరువాయి)** కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ)ను ఆదేశించారు. దీంతో పత్తి కొనుగోళ్లు యాథావిధిగా కొనసాగనున్నాయి. పత్తి కొనుగోళ్లలో గత ఏడాది సీసీఐ అనుసరించిన నియమ నిబంధనలనే ఈ ఏడాదీ పాటించనుంది. కొనుగోలు కేంద్రాలను సైతం గత ఏడాది ఏర్పాటు చేసిన సంఖ్యకు తక్కువ కాకుండా ఈసారి ఏర్పాటు చేయనుంది. పండిన పత్తిని కనీస మద్దతు ధర క్వింటాల్ కు రూ.7350 చొప్పున సీసీఐ కొనుగోలు చేయనుంది. ఈ సందర్భంగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ పత్తి రైతులెవరూ ఆందోళన చెందవద్దని, ఈ ఏడాది రాష్ట్రంలో పండిన పత్తిని కనీస మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు కేంద్రం సిద్ధంగా ఉందని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. కొందరు సృష్టించే తప్పుడు వార్తలు, పుకార్లను నమ్మి దళారులకు తక్కువ ధరకు అమ్ముకోవద్దని రైతులకు సూచించారు.





# హిమాయత్ సాగర్ నీటిని అందిస్తాం

**మేయర్ లత ప్రేమ్ గౌడ్**

**జనపదం, గండిపేట్:** బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మంచినీటి సమస్యలు ప్రజల దరి చేరకుండా చూస్తానని కార్పొరేషన్ మేయర్ మద్దెల లతా ప్రేమ్‌గౌడ్ అన్నారు. సాధ్యమైనంత త్వరగా మంచినీటి కష్టాలు తీర్చేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని వివరించారు. ఈ మేరకు సోమవారం మేయర్ మాట్లాడుతూ.. రూ.2 కోట్లతో ఫిల్టర్ బెడ్, రూ.4.5 కోట్ల పైప్ లైన్ పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. ఏళ్ల తరబడి మంచినీటి కోసం ఎదురు చూస్తున్న హిమాయత్ సాగర్ నీటిని ప్రజలకు అందించడం జరుగుతుందని తెలిపారు. మేయర్ గా ఎన్నికైన తర్వాత ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం 45 రోజులో హిమాయత్ సాగర్ నీళ్లు అందిస్తామన్నారు. రూ.6.50 కోట్లతో ప్రజల నీటి కష్టాలను తొలగిస్తామన్నారు. 5 ఎంఎల్ 5 లక్షల లీటర్లు ఫిల్టర్ బెడ్ తో నీటిని ప్రజలకు అందిస్తామని అన్నారు. రానున్న వేసవి కాలన్ని దృష్టిలో పెట్టుకోని హిమాయత్ సాగర్ నీటిని అందించేందుకు సహకరించిన స్పీకర్, ప్రసాద్, ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, డిప్యూటీ మేయర్, ఇతర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

# భారత అమ్ములపొదిలోకి మరో అద్భుతం

**1000 కిమీ రేంజ్ తో యాంటీ షిప్ మిస్సైల్ సిద్ధం**

**జనపదం, న్యూఢిల్లీ:** భారత అమ్ముల పొదిలో త్వరలో మరో అద్భుత ఆయుధం చేరనుంది. భారత్ రాకెట్ ఫోర్స్‌కు వెన్నుదన్నుగా దీర్ఘశ్రేణి యాంటీ–షిప్ బాలిస్టిక్ మిస్సైల్‌ను 'రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ' (డీఆర్‌డీఓ) పరీక్షించనున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. ఈ పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్లు వెల్లడించారు. ఈ క్షిపణులు వెయ్యి కిలోమీటర్ల పరిధిలో ప్రయాణిస్తున్న యుద్ధ నౌకలను, విమాన వాహక నౌకలను ధ్వంసం చేయగల సామర్థ్యం కలిగినట్లు పేర్కొన్నారు. ఈ దీర్ఘశ్రేణి క్షిపణిని తీర ప్రాంతం, యుద్ధ నౌకల నుంచి లక్ష్యాలపైకి ప్రయోగించవచ్చని రక్షణ అధికారులు తెలిపారు. ఈ క్షిపణుల ద్వారా సుదూర ప్రాంతాల్లోని శత్రు నౌకలను నావికాదళం తుదముట్టించగలదని చెప్పారు. భారత నావికాదళ శక్తి సామర్థ్యాలను ఈ దీర్ఘశ్రేణి క్షిపణుల రాక మరింత ఇనుమడింపజేస్తోందని వెల్లడించారు. ప్రళయ్ వంటి స్వల్ప శ్రేణి లక్ష్యాలను ఛేదించగల క్షిపణుల చేరికతో ఇండియన్ ఆర్మీ, వాయుసేనల పోరాట పటిమ మరింత పెరిగ్గా దీర్ఘశ్రేణి లక్ష్యాలను ఛేదించగల ఈ క్షిపణులతో సముద్రజలాల్లో గస్తీ సామర్థ్యం మరింతగా పెరుగుతుందని విశ్లేషించారు. శత్రువుల నుంచి ఎటువంటి భద్రతా సవాళ్లు ఎదురైన వాటిని ధీటుగా ఎదుర్కొనేందుకు రక్షణ శాఖ ఎప్పటికప్పుడు అధునాతన ఆయుధాలను సమకూర్చుకుంటున్నట్లు అధికారులు చెప్పారు.



# 13 మంది ఐఏఎస్‌ల బదిలీ

**స్మితా సభర్వాల్కు మరో పోస్టింగ్**
**జీహెచ్ఎంసీ కమిషనర్‌గా ఇలంబరితి**

**జనపదం, హైదరాబాద్ సిటీ:** రాష్ట్రంలో మళ్లీ ఐఏఎస్‌ల బదిలీలు జరిగాయి. ఈసారి 13 మంది ఐఏఎస్ ఆఫీసర్లు బదిలీ అయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఉత్తర్వులు జారీ చేశారు. కొంతకాలంగా ప్రాధాన్యం లేని పోస్టులో ఉన్న స్మితా సభర్వాల్కు కొన్ని శాఖల బాధ్యతలను అప్పగించారు. పర్యాటకం, సాంస్కృతిక, యువజన సర్వీసుల శాఖ కార్యదర్శిగా స్మితా సభర్వాల్ నియామకం అయ్యారు. రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ కార్యదర్శిగా స్మితా సభర్వాల్ అదనపు బాధ్యతల్లో కొనసాగనున్నారు. బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శిగా ఇ. శ్రీధర్, దేవాదాయ శాఖ కమిషనర్‌గా శ్రీధర్‌కే అదనపు బాధ్యతలు అప్పగించారు. మహిళా, శిశు సంక్షేమం, ఎస్సీ అభివృద్ధి శాఖ కార్యదర్శిగా అనితా రామచంద్రన్, జీహెచ్ఎంసీ కమిషనర్‌గా ఇలంబరితి, రవాణా శాఖ కమిషనర్‌గా కే సురేంద్ర మోహన్, ఎక్సైజ్ శాఖ డైరెక్టర్‌గా సీహెచ్ హరికిరణ్, ట్రాన్స్ కో సీఎండీగా కృష్ణ భాస్కర్, డిప్యూటీ సీఎం ప్రత్యేక కార్యదర్శిగా అదనపు బాధ్యతల్లో కూడా కృష్ణ భాస్కర్ కొనసాగనున్నారు. ఆరోగ్యశ్రీ ట్రస్టు సీఈవోగా శివశంకర్, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి డైరెక్టర్‌గా సృజన నియామకం అయ్యారు.



# కిలో ఉల్లి రూ.100..?

**ఢిల్లీ, ముంబైలో ఆకాశానికి ధరలు..**
**బేజారవుతున్న వినియోగదారులు..**

**జనపదం, న్యూఢిల్లీ:** దేశంలో ఉల్లి ధరలు రోజు రోజుకు ఘాటెక్కు తున్నాయి. నిన్న, మొన్నటి వరకు కిలో రూ.40 వరకు ఉన్న ఉల్లి ధరలు ఇప్పుడు రెట్టింపయ్యాయి. ఇక ముంబై, ఢిల్లీలోని కొన్ని ప్రాంతాల్లో కిలో ఉల్లి ధర ఏకంగా రూ.100 పలుకుతోందని సమాచారం. హోల్ సేల్ మార్కెట్ లో కిలో ఉల్లి ప్రస్తుతం రూ.40 నుంచి 60 పలుకుతుండగా తాజా అది రూ.70 నుంచి 80 రూపాయలకు పెరిగింది. మరికొద్ది రోజుల్లో హోల్ సేల్ మార్కెట్ లోనే కిలో ఉల్లి రూ.100 చేరుకునే అవకాశం ఉందని వ్యాపారులు అంటున్నారు. దీంతో ఉల్లి కొనాలంటే ప్రజలు భయపడే పరిస్థితి వచ్చింది. వంటింట్లో ఉల్లి లేనిదే ఏ వంట పూర్తి కాదు. అయితే ఉల్లి ధరలు పెరుగుదలకు ద్రవ్యోల్బణం ప్రభావం కూడా ఉందని నిపుణులు చెబుతున్నారు.

# బాసర ట్రిపుల్ ఐటీలో విద్యార్థిని ఆత్మహత్య



**మృతిపై అనుమానాలు..?**
**బాధ్యులపై చర్యలు తీసుకోవాలి : స్వాతిప్రియ తల్లిదండ్రులు**

**జనపదం, నిర్మల్ :** నిర్మల్ జిల్లా బాసర ట్రిపుల్‌ఐటీలో పీయూసీ 2 చదువుతున్న నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ ప్రాంతానికి చెందిన స్వాతి ప్రియ సోమవారం ఉదయం ఆత్మహత్య చేసుకుంది. వ్యక్తిగత కారణాలతో విద్యార్థిని ఆత్మహత్య చేసుకుందని ట్రిపుల్ ఐటీ అధికారులు పేర్కొంటున్నారు. విద్యార్థికి సోమవారం ఉదయమే పరీక్షలున్నాయి. పరీక్షల రోజే విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడటం పలు అనుమానాలకు తావిస్తోంది. ఆత్మహత్యకు కారణాలు పూర్తిగా తెలియాల్సి ఉంది. విద్యార్థిని మృతితో ట్రిపుల్ ఐటీ లో విషాదఛాయలు అలుముకున్నాయి. విషయాన్ని విద్యార్థిని కుటుంబసభ్యులకు ట్రిపుల్ ఐటీ అధికారులు సమాచారాన్ని చేరవేశారు. విద్యార్థిని కుటుంబ సభ్యులు వచ్చేంత వరకు పూర్తి వివరాలు బయటకు వచ్చే అవకాశాలు లేవు. మృతదేహాన్ని ముందుగా ట్రిపుల్ ఐటీ లో గల ఆస్పత్రికి తరలించారు. వెంటనే ట్రిపుల్ ఐటీ అంబులెన్స్ లో విద్యార్థిని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించారు. ట్రిపుల్ ఐటీ వీసీ గోవర్ధన్ హైదరాబాద్ లో ఉండడంతో ఈ విషయం తెలుసుకొని హుటాహుటిన ట్రిపుల్ ఐటీకి వస్తున్నట్టు సమాచారం.

**నా కూతురి మృతికి కళాశాల అధికారులే కారణం..**

**మృతురాలి తల్లిదండ్రులు**

తమ కూతురు మృతికి కళాశాల అధికారులే కారణమని స్వాతి ప్రియ తల్లిదండ్రులు ఉజ్వల, రవీందర్ ఆరోపించారు. ఈ మేరకు కళాశాల గేటు సమీపంలో మృతురాలి తల్లి ఉజ్వల మాట్లాడుతూ సోమవారం ఉదయమే తాను అల్పాహారానికి వెళుతున్నానని సంతోషంగా చెప్పి వెళ్లిందని, అలాంటి అమ్మాయి ఆత్మహత్యకు ఎలా పాల్పడుతుందని ప్రశ్నించారు. మృతురాలు సూసైడ్ నోట్ రాసిందని చెబుతున్న అధికారులు దాన్ని తమకు ఎందుకు చూపించలేదని ప్రశ్నించారు. తమ కూతురుపై కొందరు అధికారుల అక్కసు వెళ్ళగక్కారని తమకు అనుమానం ఉందని పేర్కొన్నారు. తండ్రి రవీందర్ మాట్లాడుతూ ఘటనపై చర్య తీసుకోవాలని కలెక్టర్, ఎస్పీలకు ఫిర్యాదు చేసినట్లు వివరించారు.

# సిగ్గుండాలే..

హరీష్ రావు దుయ్యబట్టారు. మద్యం అమ్మకాలు అరికడతామని, బెల్టు షాపులను మూసివేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన రేవంత్ రెడ్డి ఇప్పుడు మద్యం అమ్మకాల పెంచాలని ఎక్సైజ్ ఇన్ స్పెక్టర్లను ఒత్తిడి చేయడం ద్వంద్వ వైఖరికి నిదర్శనం అన్నారు. ఎక్సైజ్ అధికారులు తమ సర్కిళ్లలో అమ్మకాలను 10 శాతం నుంచి 25 శాతానికి పెంచాలని ప్రభుత్వం ఒత్తిడి చేయడం, విక్రయ లక్ష్యాలను చేరుకోకపోతే బదిలీ చేస్తానని బెదిరించడం దుర్మార్గమైన చర్య అన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో చెప్పిన ఎక్సైజ్ పాలసీకి సవరణ ఇదేనా.. అని ప్రశ్నించారు. ప్రజల ఆరోగ్యాన్ని ఫణంగా పెట్టి, ప్రభుత్వ ఆదాయం పెంచుకునేందుకు 1.7 లక్షల బెల్ట్ షాపులు విచ్చలవిడిగా పనిచేసేలా ప్రభుత్వం ప్రోత్సహించడం శోచనీయమని, రేవంత్ రెడ్డి ప్రభుత్వం 11 నెలల్లో సాధించిన మార్పు ఇదేనా అని హరీష్ రావు ఎద్దేవా చేశారు.

Printed and Published Mallika. On behalf of Sri Krishna Vande Jagadgurum Publications, Published at Banjara Hills Road , Erramazill 6-3-562-14, Hyderabad - Telangana 500082.
Printing at Colour Graphics, 2-6-652/12, Amberpet Musarambagh Road ,Hyderabad, 500013 Telangana. Editor Sramik (Responsible for selection of News under the PRB act )
Reg no APTEL / 2012/46581, Phone Number 9849290606, Email ID : janapadham0606@gmail.com